

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 12-06-2026 | సంపుటి - 29 | సంచిక -16 | రూ : 4 | పేజీలు: 8




## అత్యధిక వేడి ముప్పున్న ప్రపంచ టాప్
# 30 నగరాల్లో హైదరాబాద్!

- ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడి
- వేగంగా పెరిగిన నగరీకరణ, పచ్చదనం తగ్గడమే ప్రధాన కారణాలు
- ఈ వేసవిలో రికార్డు స్థాయిలో 47 రోజులు 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు
- భారత్ నుంచి 14 నగరాలకు అధిక ఉష్ణ ముప్పు ఉందన్న నివేదిక

2లో

## ఈ రాత్రే ఇరాన్‌పై
# తీవ్ర దాడులు
## ట్రంప్ సంచలన ప్రకటన



- ఇరాన్ కీలక ఆయిల్ కేంద్రమైన ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని వెల్లడి
- ఇప్పటికే ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న సైనిక ఘర్షణలు
- దాడుల హెచ్చరికల మధ్యే కొనసాగుతున్న దౌత్యపరమైన చర్చలు

2లో



## చైనాను కాపీ కొట్టొద్దు
# భారత్‌కు గ్లోబల్ ఇన్వెస్టర్ కీలక సలహా

- చైనాను అనుకరించకుండా సొంత వృద్ధి మార్గాన్ని భారత్ వెతకాలి
- ప్రముఖ ఇన్వెస్టర్ మార్టిన్ ఎస్కోబారి కీలక సూచన
- దేశ ఆర్థిక ప్రగతి విషయంలో ఓపిక అవసరమన్న ఎస్కోబారి
- 8 శాతం వృద్ధిరేటు చాలా గొప్పదని కొనియాడిన వైనం
- భారత్ సామర్థ్యంపై పూర్తి నమ్మకం ఉందన్న నిఖిల్ కామత్

2లో



## వైజాగ్ స్టీల్ ప్లాంట్ లో
## మరో ప్రమాదం..
# తప్పిన ముప్పు

- తెల్లవారుజామున మరోసారి లీక్ అయిన ద్రవ ఉక్కు
- ఆ సమయంలో అక్కడ కార్మికులు లేకపోవడంతో తప్పిన ముప్పు
- మొన్న జరిగిన ప్రమాదంలో 9 మంది కార్మికుల దుర్మరణం

2లో

## రాష్ట్ర ప్రాజెక్టులకు
# కేంద్రం సహకరించాలి




- నీ ప్రధాని మోడీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది
- 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలబెడతాం
- ప్రతి నియోజకవర్గానికో యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తాం
- తెలంగాణకు ఎవరొచ్చినా ఈ స్కూళ్లను సంతోషంగా చూపిస్తాం
- నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

2లో

## పారదర్శక పాలన కోసమే
# శాశ్వత భవనాలు

- మొదటిదశలో 125 తహసీల్దార్, 11 ఆర్డీవో ఆఫీసులకు శాశ్వత భవనాలు
- అన్నీ ఒకే నమూనాలో ఉండేలా నిర్మాణాలు
- సచివాలయంలో ఉన్నతాధికారుల సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్: ప్రజలకు పారదర్శక పాలన అందించాలనే లక్ష్యంతో ఆర్డీవో, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, **తరువాయి 2లో**



## పరీక్షల అక్రమాలపై దేశవ్యాప్త ఉద్యమం..
## విద్యా మేనిఫెస్టో విడుదల చేయనున్న కాక్రోచ్ పార్టీ


- ప్రకటించిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే
- పుణే నుంచి ఉద్యమం ప్రారంభం కానున్నట్లు వెల్లడి
- పేపర్ లీక్‌లపై కఠిన చర్యలకు డిమాండ్
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనన్న దీప్కే
- జూన్ 20న జంతర్‌మంతర్‌లో భారీ ఆందోళన

2లో



## ప్రధాని మోదీతో
# డీకే శివకుమార్ భేటీ!

- రాష్ట్రాభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలని విజ్ఞప్తి
- బెంగళూరు మెట్రో, రింగ్ రోడ్ వంటి మౌలిక సదుపాయాలపై ప్రధానంగా చర్చ
- గత ప్రభుత్వ వైఖరికి భిన్నంగా నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్న శివకుమార్



2లో

# రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి

న్యూఢిల్లీ బ్యూరో : తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్రం సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం నాడిక్కడ ప్రధాని నరేంద్ర మోడీతో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని వివరించారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలని కూడా ప్రధానికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఫేజ్-2లో ఏడు కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు రూ.38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్టు వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని కోరారు.

**ట్రిపుల్ ఆర్ పనులకు ఆమోదం తెలపండి**

హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, ఎన్‌హెచ్ఏఐకి రూ.626 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ట్రిపుల్ ఆర్‌లో దక్షిణ భాగం నిర్మాణం కూడా అంతే కీలకమని ముఖ్యమంత్రి వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాపులు, హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని చెప్పారు. ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.హైదరాబాద్-అమరావతి-బందర్ పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్రం అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టును కలిపే 12 లేన్ ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. 120 మీటర్ల రైట్ ఆఫ్ వే తో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనుల గురించి ప్రస్తావన వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించాలన్న అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. ఇప్పటికే అవసరమైన భూసేకరణ పూర్తిచేసి ఎయిర్ పోర్ట్ అథారిటీకి అప్పగించామని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మరింత లబ్ధి చేకూరుతుందని అన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఐఎంకు అవసరమయ్యే 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, టీఐఎఫ్ఆర్ వంటి ప్రముఖ జాతీయ విద్యాసంస్థలున్నాయని, ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం 2020 ఆశించిన లక్ష్యం కూడా నెరవేరుతుందని ప్రస్తావించారు.

## మంత్రి లోకేశ్ ఓఎస్డీకి ఎస్వీయూ నుంచి రెండు స్వర్ణ పతకాలు

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వద్ద ప్రత్యేక అధికారిగా (ఓఎస్డీ) పనిచేస్తున్న డాక్టర్ కాశిరెడ్డి వరప్రసాద్ అరుదైన విద్యావిషయక గౌరవాన్ని అందుకున్నారు. ఆర్థిక శాస్త్రంలో ఆయన చేసిన పీహెచ్‌డీ పరిశోధనకు గాను తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ) ఆయనకు రెండు స్వర్ణ పతకాలను ప్రదానం చేసింది. ఎస్వీయూలో జరిగిన 63 నుంచి 68వ ఉమ్మడి స్నాతకోత్సవ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టర్ వరప్రసాద్ ఈ పతకాలను అందుకున్నారు. ఆయనకు 'డాక్టర్ మన్మోహన్ సింగ్ గోల్డ్ మెడల్' తో పాటు 'ప్రొఫెసర్ డీఎల్ నారాయణ మెమోరియల్ పీహెచ్‌డీ గోల్డ్ మెడల్' లభించాయి. పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనకు మున్సిపల్ బాండ్ల ద్వారా నిధుల సమీకరణపై ఆయన తన పరిశోధన సాగించారు. ఈ విధానాన్ని అటు ప్రభుత్వాలకు, ఇటు పెట్టుబడిదారులకు లాభదాయకంగా మార్చేందుకు అవసరమైన విధానపరమైన మార్పులను తన సిద్ధాంత గ్రంథంలో కూలంకషంగా విశ్లేషించారు. డాక్టర్ వరప్రసాద్ ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక శాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా సేవలందిస్తూనే, డిప్యూటేషన్‌పై మంత్రి నారా లోకేశ్ వద్ద ఓఎస్డీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2014-19 మధ్యకాలంలో ముఖ్యమంత్రి కార్యాలయంలో (సీఎంఓ) పనిచేసిన ఆయన, ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాలు, బడ్జెట్ రూపకల్పన వంటి అంశాల్లో నిపుణుడిగా పేరుగాంచారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అప్పులకు సంబంధించిన గణాంకాలపై మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో ఆయన సస్పెన్షన్‌కు గురయ్యారు. తదుపరి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఆయన తిరిగి విధుల్లో చేరడం గమనార్హం.

## ఈ రాత్రే ఇరాన్‌పై తీవ్ర దాడులు ట్రంప్ సంచలన ప్రకటన

అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పతాకస్థాయికి చేరాయి. ఇరాన్‌పై ఈ రాత్రే భారీస్థాయిలో దాడులు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. సమీప భవిష్యత్తులో ఇరాన్‌కు చెందిన కీలక చమురు క్షేత్రాలను, ముఖ్యంగా ఖర్గ్ ద్వీపాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గురువారం తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ రాత్రే అమెరికా బలగాలు ఇరాన్‌పై అత్యంత తీవ్రమైన దాడులు చేయనున్నాయి. త్వరలోనే ఖర్గ్ ద్వీపంతో పాటు ఇతర చమురు మౌలిక సదుపాయాల కేంద్రాలను స్వాధీనం చేసుకుంటాం. వారి చమురు, గ్యాస్ మార్కెట్లపై పూర్తి నియంత్రణ సాధిస్తాం" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. ఇప్పటికే ఇరు దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇటీవల ఇరాన్‌కు చెందిన గగనతల రక్షణ, నిఘా వ్యవస్థలపై అమెరికా దాడులు నిర్వహించింది. మరోవైపు, తమ అపాచీ హెలికాప్టర్‌ను ఇరాన్ కూల్చివేసిందని అమెరికా ఆరోపిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ చేసిన తాజా హెచ్చరికలు అంతర్జాతీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న ఖర్గ్ ద్వీపం, ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఆ దేశం నుంచి జరిగే ముడి చమురు ఎగుమతుల్లో సుమారు 90 శాతం ఇక్కడి నుంచే సాగుతాయి. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ ప్రకటించడం ప్రపంచ దేశాల్లో ఆందోళన కలిగిస్తోంది. సైనిక చర్యల హెచ్చరికల కొనసాగుతున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన చర్చలు కూడా జరుగుతున్నాయని, అయితే అవి మందకొడిగా సాగుతున్నాయని తెలుస్తోంది.



## ప్రధాని మోదీతో డీకే శివకుమార్ భేటీ!

కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం డీకే శివకుమార్ తొలిసారిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. గురువారం ఢిల్లీలో ఈ భేటీ జరిగింది. కర్ణాటక రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆయన ప్రధానిని కోరారు. జూన్ 3న ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శివకుమార్, తన ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వం నీతి ఆయోగ్ సమావేశాలను బహిష్కరించగా, అందుకు భిన్నంగా శివకుమార్ ఈ సమావేశానికి హాజరుకావడం ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్రంతో సమన్వయంతో పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందనే సంకేతాలను ఆయన ఈ సందర్భంగా ఇచ్చారు. ప్రధానితో భేటీకి ముందు శివకుమార్ కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎలివేటెడ్ కారిడార్లు, పెరిఫెరల్ రింగ్ రోడ్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలను అందించాలని కోరారు. బెంగళూరు మెట్రో ఫేజ్ 2 సవరించిన అంచనాలకు, అలాగే ఫేజ్ 3 ప్రాజెక్టుకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు బెంగళూరు నుంచి మైసూరు, తుమకూరు, కోలార్ నగరాలను అనుసంధానిస్తూ రీజినల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటుపై కూడా చర్చించారు. ప్రధాని మోదీతో జరిపిన చర్చలు అత్యంత ఫలప్రదంగా, నిర్మాణాత్మకంగా సాగాయని శివకుమార్ వెల్లడించారు. రాష్ట్ర సంక్షేమం, ప్రగతి కోసం కేంద్రం నుంచి పూర్తి సహకారం ఉంటుందని గతంలో ప్రధాని ఇచ్చిన హామీని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## వైజాగ్ స్టీల్ ప్లాంట్ లో మరో ప్రమాదం.. తప్పిన ముప్పు

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లో వరుసగా జరుగుతున్న ఘటనలు కార్మికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. మూడు రోజుల క్రితం జరిగిన భారీ ప్రమాదంలో 9 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయిన విషాదం ఇంకా మరువక ముందే.. ఈ తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో ప్లాంట్‌లో మరో ప్రమాదం చోటుచేసుకుంది. భారీ ప్రమాదం త్రుటిలో తప్పింది. ఎస్ఎమ్ఎస్1 విభాగంలోని ఆర్గాన్ రిన్సింగ్ స్టేషన్ వద్ద లాడిల్ నుండి ద్రవ ఉక్కు ఒక్కసారిగా లీకైంది. అయితే, లీకేజీ జరిగిన సమయంలో అక్కడ కార్మికులు ఎవరూ లేకపోవడంతో మరో పెద్ద ప్రాణ నష్టం, ముప్పు తప్పినట్లయింది. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే అలాంటి ఘటన పునరావృతం కావడంతో స్టీల్ ప్లాంట్ కార్మికులు, కార్మిక సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జూన్ 8న ఎస్ఎమ్ఎస్2 విభాగంలో లాడిల్ నుండి ద్రవ ఉక్కు పొంగిపొర్లడం వల్ల 9 మంది అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. పలువురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ మరణాల నేపథ్యంలో ఇప్పటికే కూటమి ప్రభుత్వం బాధిత కుటుంబాలకు భారీ ఎక్స్‌గ్రేషియా అందించింది. మృతుల కుటుంబాల్లో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ప్రకటిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

## అత్యధిక వేడి ముప్పున్న ప్రపంచ టాప్30 నగరాల్లో హైదరాబాద్!

ప్రపంచంలో అత్యధిక ఉష్ణోగ్రతల ముప్పును ఎదుర్కొంటున్న నగరాల జాబితాలో హైదరాబాద్ కూడా చేరింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తాజాగా వెల్లడించిన ఒక అధ్యయనం ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉష్ణ ప్రమాదాలు పొంచి ఉన్న 30 నగరాలలో హైదరాబాద్ ఒకటిగా నిలిచింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వేగవంతమైన పట్టణీకరణ వల్ల తలెత్తుతున్న పర్యావరణ ముప్పులకు ఈ నివేదిక అద్దం పడుతోంది. 'మూవింగ్ బియాండ్ ఎక్స్‌పోజర్' పేరిట ప్రపంచవ్యాప్తంగా 205 ప్రధాన నగరాలపై ఈ పరిశోధన నిర్వహించారు. కేవలం గరిష్ఠ ఉష్ణోగ్రతలు కాకుండా, నగరాల్లోని కూలింగ్ సదుపాయాలు, పచ్చదనం, సామాజిక ఆర్థిక పరిస్థితులు వంటి వివిధ అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ నివేదికను రూపొందించారు. ఒక కోటికి పైగా జనాభా కలిగిన హైదరాబాద్ నగరానికి 'హీట్ వల్నరబిలిటీ ఇండెక్స్'లో 0.68 స్కోర్ లభించింది. ఈ జాబితాలో కైరో, మనీలా వంటి అంతర్జాతీయ నగరాల సరసన హైదరాబాద్ నిలిచింది. భారత్‌లోని అహ్మదాబాద్, నాగ్‌పూర్, మదురై నగరాల్లో హైదరాబాద్ కంటే ఎక్కువ ముప్పు ఉన్నట్టు ఈ నివేదిక స్పష్టం చేసింది. కాగా ముంబై, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ వంటి నగరాల పరిస్థితి కాస్త మెరుగ్గా ఉన్నట్లు వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఉష్ణ ముప్పును ఎదుర్కొంటున్న టాప్50 నగరాల్లో 14 భారత్‌కు చెందినవే కావడం గమనార్హం. ఈ ఏడాది వేసవిలో హైదరాబాద్ నగరం గత దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంతటి తీవ్రమైన ఎండలను చవిచూసింది. ఏప్రిల్ 1 నుంచి జూన్ 5 మధ్యకాలంలో సుమారు 47 రోజులు పాటు ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. నగరం వేగంగా విస్తరించడం, పచ్చదనం క్షీణించడం, తగ్గిన కూలింగ్ సదుపాయాలు అందరికీ అందుబాటులో లేకపోవడం వంటి కారణాలు ఈ ముప్పును మరింత తీవ్రం చేస్తున్నాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నగరాలు తక్షణమే స్పందించి పచ్చదనాన్ని పెంచాలని, అందరికీ అందుబాటులో ఉండేలా కూలింగ్ సదుపాయాలను మెరుగుపరచాలని ఈ అధ్యయనం సూచిస్తోంది.

## పరీక్షల అక్రమాలపై దేశవ్యాప్త ఉద్యమం..

పరీక్షల నిర్వహణలో అక్రమాలు, పేపర్ లీక్‌లు, ఫలితాల జాప్యాలపై దేశవ్యాప్త ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ప్రకటించారు. పుణేలోని సావిత్రిభాయి యూనివర్సిటీ ప్రాంగణంలో ఈరోజు సాయంత్రం ఈ ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ విద్యా మేనిఫెస్టోను కూడా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. రాజ్యాంగ పరిధిలోనే శాంతియుతంగా నిరసనలు చేపడతామని దీప్కే స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టడం, పరీక్ష ఫలితాలను సకాలంలో విడుదల చేయడం, నియామకాలు, ప్రవేశ పరీక్షల్లో పారదర్శకత పెంచడం, పరీక్షల నిర్వహణ సంస్థల జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలకు మేనిఫెస్టోలో ప్రాధాన్యం ఇచ్చామని వివరించారు. పరీక్షల నిర్వహణలో లోపాల వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా ఈ మేనిఫెస్టోలో ప్రస్తావించామని చెప్పారు. పుణే నుంచి ప్రారంభమయ్యే ఈ ఉద్యమాన్ని దేశంలోని పలు నగరాలకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. జైపూర్, లక్నో, అమృత్‌సర్, బెంగళూరు నగరాల్లో కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత జూన్ 20న ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో భారీ ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామని దీప్కే స్పష్టం చేశారు. కోటి మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే తమ సమస్యలను వినే బదులు ప్రభుత్వం సోషల్ మీడియా ఖాతాలపై చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని దీప్కే కోరారు. తమ సంస్థను తేలిగ్గా తీసుకోకుండా విద్యార్థుల ఆందోళనలకు స్పందించాలని అన్నారు. ఇటీవల పరీక్షలకు సంబంధించిన అంశాలపై సోషల్ మీడియాలో తమ సంస్థకు మంచి గుర్తింపు లభించిందని, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం యువత ఆధ్వర్యంలో పనిచేస్తున్న వేదికగా ఎదుగుతోందని పేర్కొన్నారు.

## చైనాను కాపీ కొట్టొద్దు: భారత్‌కు గ్లోబల్ ఇన్వెస్టర్ కీలక సలహా

ఆర్థిక వృద్ధి సాధనలో చైనా నమూనాను గుడ్డిగా అనుసరించడం కంటే, భారత్ తనకంటూ ఒక ప్రత్యేకమైన మార్గాన్ని నిర్దేశించుకోవాలని అంతర్జాతీయ పెట్టుబడి సంస్థ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ 'జనరల్ అట్లాంటిక్' సహఅధ్యక్షుడు మార్టిన్ ఎస్కోబారి సూచించారు. దేశం సుస్థిరమైన వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో, కొంత సహనం వహించడం అవసరమని ఆయన పేర్కొన్నారు. జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహించిన ఒక పోడ్‌కాస్ట్‌లో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో 5 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టిన అనుభవంతో ఎస్కోబారి ఈ విశ్లేషణ చేశారు. చైనా తన పారిశ్రామికీకరణ, మౌలిక సదుపాయాల కల్పన, ఎగుమతి ఆధారిత తయారీ రంగాల ద్వారా అసాధారణ ప్రగతిని సాధించిందని ఆయన ఉదహరించారు. అయితే, చైనా అనుసరించిన విధానాలను యథాతథంగా అనుకరించడం భారత్‌కు శ్రేయస్కరం కాదని ఆయన స్పష్టం చేశారు. "భారత్ యొక్క సంక్లిష్టత, సంప్రదాయాలు మరియు వైవిధ్యానికి తగినట్లుగా ప్రత్యేకమైన వ్యూహాలు అవసరం. ప్రస్తుతం భారత్ నమోదు చేస్తున్న 8 శాతం వృద్ధి రేటు అభినందనీయం. దేశాభివృద్ధి విషయంలో కొంత ఓపిక అవసరం" అని ఆయన సలహా ఇచ్చారు. ఈ సందర్భంగా నిఖిల్ కామత్ మాట్లాడుతూ, భారత్ సామర్థ్యాలపై తనకు పరిపూర్ణ విశ్వాసం ఉందని, భవిష్యత్తులో మన దేశం 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## పారదర్శక పాలన కోసమే శాశ్వత భవనాలు: పొంగులేటి

హైదరాబాద్ : ప్రజలకు పారదర్శక పాలన అందించాలనే లక్ష్యంతో ఆర్డీవో, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ భవనాలను హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సచివాలయంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎన్ని తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి, శిథిలావస్థ, పాలనకు అనువుగా లేని భవనాల వివరాలను సేకరించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరైంది కాదు. ప్రజలకు



సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నాం. మొదటి దశలో అద్దె భావనాల్లో, శిథిలావస్థలో ఉన్న 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్డీవో కార్యాలయాలను ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తాం. అవసరమైన చోట మరమ్మతులు చేపట్టడానికి నివేదికలు అందించాలి. ఇందుకు అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించి నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలి అని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండేలా డిజైన్ చేస్తాం. సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తాం. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుంది అని పొంగులేటి పేర్కొన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా మండలాల పునర్విభజన చేపట్టింది. కొన్ని మండలాలు రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చే విధంగా రూపొందించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశాం అని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి వివరించారు.

# ఆర్టీసీ బస్సు–కారు ఢీ ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (రేగొండ) , ప్రజాస్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం బాగిర్తిపేట స్టేజ్ సమీపంలో మంగళవారం ఆర్టీసీ బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికుల కథనం ప్రకారం, గాయపడిన వారిలో భూపాలపల్లి జిల్లా ఆర్టీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏవో రజితతో పాటు ఆమె సోదరి ఉన్నట్లు గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి 108 అంబులెన్స్కు సమాచారం అందించారు. అనంతరం గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

# ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలి

*** జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న జిల్లా అధికారులు గురువారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. జగిత్యాల జిల్లాకు బదిలీ అయిన జిల్లా రవాణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని, క్వాలిటీ కంట్రోల్ ఈఈగా నియమితులైన భూపాలపల్లి డివిజన్ ఈఈ బసవ ప్రసాద్, పరకాల ఉద్యాన అధికారిగా బాధ్యతలు స్వీకరించనున్న జిల్లా ఉద్యాన అధికారి సునీల్ కుమార్ కలెక్టర్‌ను కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహించిన సమయంలో అధికారులు అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. కొత్త బాధ్యతల్లోనూ అదే అంకితభావంతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం అధికారులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, జిల్లా పరిపాలనలో లభించిన సహకారాన్ని గుర్తు చేసుకున్నారు.

# పంచాయతీ సెక్రటరీ సరితకు ఘన వీడ్కోలు సన్మానం



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : గంట్లవెల్లి గ్రామ పంచాయతీ మాజీ సెక్రటరీ సరిత బదిలీ సందర్భంగా గ్రామంలో వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. సరిత ఎంతో చిత్తశుద్ధితో ప్రజలకు సేవలు అందించారని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చక్కటి శివకుమార్ యాదవ్, ఉప సర్పంచ్ మిద్దె మౌనిక, గంట్లవెల్లి మాజీ సర్పంచ్ కర్నాలు యాదమ్మ యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ మూడవత్ భాస్కర్ నాయక్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ కౌన్సిలర్ కానుగు అంతయ్య మాతృమూర్తి కి ఘన నివాళి



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : షాద్‌నగర్ పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ కానుగు అంతయ్య మాతృమూర్తి బాలమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన ఆయన, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాలమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్, కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, జి.టి వసంత శ్రీనివాస్, గోపాల్, అనిత రఘునాథ్, మాజీ కౌన్సిలర్లు జూపల్లి శంకర్, చెట్ల నరసింహా, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సలీం, నందిగామ శ్రీనివాస్, భీమ్ రెడ్డి, గుండు అశోక్, నవీన్, విజయ్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.


# కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో ఘనంగా మండల పూజా మహోత్సవాలు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కుషాయిగూడలోని శ్రీ కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో మండల పూజా మహోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భారీ హనుమాన్ విగ్రహ ఆవిష్కరణతో పాటు మూలవిరాట్ శ్రీ కార్యసిద్ధి హనుమాన్ స్వామి, శ్రీ మహా గణపతి స్వామి విగ్రహాల ప్రతిష్ఠకు 41 రోజులు పూర్తైన సందర్భంగా ఈ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హంపి పీఠాధిపతి పరమపూజ్య శ్రీ శ్రీ శ్రీ జగద్గురువులు విద్యారణ్య భారతి స్వామీజీ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు ఔషధీయ మహా అభిషేకం, అఖండ హోమం, ఆలయ సంప్రోక్షణ, భారీ హనుమాన్ విగ్రహ సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 159 దేవాలయాల ప్రతిష్ఠ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన బ్రహ్మశ్రీ శివ కార్తిక్ శాస్త్రి మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి ప్రణాళిక, కార్యక్రమం, నియంత్రణ అనే మూడు సూత్రాలు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రణాళికతో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, కార్యక్రమాల ద్వారా ధార్మిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని, నియంత్రణ ద్వారా ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత పాటించాలని సూచించారు. ఈ మూడు సూత్రాల సమన్వయంతో దేవాలయం సమాజానికి ఆదర్శంగా నిలిచి, భవిష్యత్ తరాలకు ఆధ్యాత్మిక మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. అనంతరం జగద్గురువులు భక్తులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు చల్లా ప్రభాకర్, యాపపురం రవి, పసగట్ల చక్రపాణి గౌడ్, అనిల్ బాబు, రేగొండ వెంకటేశ్వర్లు, సీతారామ శర్మ, నాలచర్ల జనార్ధన్, దయానంద్, పిట్ల రాజు, చల్లా వెంకటేష్, యాదగిరి, బాల్ నరసింహ, శ్రీశైలం, లక్ష్మణ్, రాములు, సుభాష్, అనిల్, రాకేష్, భరత్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘం సభ్యులు భాగస్వాములు కావాలి

*** బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘం సభ్యులు భాగస్వాములు కావాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. గురువారం సుభాష్ నగర్ డివిజన్ శ్రీ వెంకటేశ్వర హోసింగ్ వెల్ఫేర్ సొసైటీ కి చెందిన నూతన సంక్షేమ సంఘం కార్యవర్గం సభ్యులు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో శిదిలావస్థలో ఉన్న కమ్యూనిటీ హాల్ పునఃనిర్మింప చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘం సభ్యులకు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కె. కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకయ్య, జనరల్ సెక్రెటరీ చెన్నయ్య, జాయింట్ సెక్రెటరీ బసవరాజ్, ట్రెజరర్ అహ్మద్, కమిటీ సభ్యులు నందు, రమేష్, లలిత, పరమేష్, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధిక ఫీజుల వసూళ్లను తక్షణమే నియంత్రించాలి

*** ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. కె.షాహిద్, వరక అజిత్**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో సాగుతున్న అధిక ఫీజుల దోపిడీని తక్షణమే అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే షాహిద్, వరక అజిత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏడీఈఓ శ్యామ్ ప్రసాద్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుండి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. ముందస్తు అడ్మిషన్ల పేరుతో దందా సాగిస్తున్న కార్పొరేట్ స్కూళ్లపై విద్యాశాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లోనే పాఠ్య పుస్తకాలు, టై, బెల్ట్, యూనిఫాం, షూలను అధిక ధరలకు విక్రయిస్తూ విద్యను పూర్తి వ్యాపారంగా మార్చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు ఇనపల్లి పవన్ సాయి, మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్, సంఘం నాయకులు కళ్యాణ్, నవీన్, మహేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల కట్టడికి సమన్వయంతో చర్యలు చేపట్టాలి

*** కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి : వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇంటింటి ఫీవర్ సర్వేలు నిర్వహించి అనుమానిత కేసులను గుర్తించాలని, ప్రత్యేక స్పందన బృందాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వినియోగం, పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో డ్రై డే-ఫ్రై డే కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని, మురుగు కాల్వలను శుభ్రంగా ఉంచి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాగునీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించి, నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని సూచించారు.ప్రజల భాగస్వామ్యంతోనే సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా నియంత్రించవచ్చని పేర్కొన్న కలెక్టర్, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు

# లక్ష్మీనగర్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : చర్లపల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులకు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ గురువారం శ్రీకారం చుట్టారు. కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి చేత కొబ్బరికాయ కొట్టించి పనులను ప్రారంభించారు. సుమారు 440 మీటర్ల పొడవుతో, 330 మిల్లీమీటర్ల వ్యాసార్థంతో రూ.31 లక్షల వ్యయంతో ఈ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనులు పూర్తయిన అనంతరం కాలనీవాసులకు మురుగునీటి సమస్య నుంచి శాశ్వత ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రంజిత్, సంతోష్ రెడ్డి, కొండల్ రెడ్డి, అశోక్, రామ్ రెడ్డి, చంద్రశేఖర్, జగన్, చంద్రం, విజయ్ కుమార్, కిరణ్, కాంగ్రెస్ నాయకులు ప్రభు గౌడ్, భాను చందర్, ఆనంద్ రాజ్ గౌడ్, మల్లేష్, గణేశ్ గౌడ్, ముత్యాలు, వెంకట్ గౌడ్, వెంకట్ రెడ్డి, నాసిర్, సదానందం, శ్యాం, లక్ష్మయ్య, సమ్మయ్య, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పైప్లైన్ లీకేజ్ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్




ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : మున్సిపల్ పరిగి రోడ్డు అంబికా స్టీల్ షాప్ వద్ద మిషన్ భగీరథ లీకేజీ మరమ్మత్తు పనులను పరిశీలించిన షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, కౌన్సిలర్ రాజు నాయక్, జమ్రుద్ ఖాన్, మున్సిపల్ అధికారులు సాయి కిరణ్, నరేష్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

# అక్కివేనిగూడ హనుమాన్ దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేత



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని అక్కివేనిగూడ గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ హనుమాన్ దేవాలయానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ రూ.30,116 నగదు విరాళాన్ని అందజేశారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గారి సూచనలు, ఆశీస్సులతో దేవాలయ నిర్మాణ కార్యక్రమానికి తన వంతు సహకారంగా ఈ విరాళాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వై. రవీందర్ యాదవ్ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కేంద్రాలు సమాజంలో ఐక్యత, సాంస్కృతిక విలువలు మరియు ధార్మిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మిస్తున్న శ్రీ హనుమాన్ దేవాలయం భక్తులకు ఒక పవిత్ర క్షేత్రంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ విరాళం అందజేసినందుకు దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు , భక్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# మున్సిపాలిటీ అధికారులతో సమీక్ష సమావేశం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబాబాద్ మున్సిపాలిటీ కి చెందిన మున్సిపల్ శాఖ అధికారులతోసమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్ ప్రత్యేక శ్రద్ధ తో పట్టణ సుందరీకరణ పట్టణంలోని ప్రధాన రహదారులు, సెంట్రల్ లైటింగ్, పార్కుల అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు మున్సిపల్ చైర్మన్ కు ఆదేశించారు.పారిశుధ్య నిర్వహణ వర్షాకాలం దృష్ట్యా పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, వ్యర్థాల సేకరణ, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.మౌలిక సదుపాయాలు ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నిలిచిపోయిన సిసి రోడ్లు, సివిల్ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కారం వార్డుల వారీగా ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా మున్సిపల్ సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ సమీక్ష సమావేశం లో మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ గూగులోత్ జ్యోతి రమేష్, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఆహార వ్యాపారులకు ప్రభుత్వం చేయూత.. ప్రత్యేక లైసెన్స్ మేళా

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని ఆహార వ్యాపార నిర్వాహకుల (ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు) కోసం ఎఫ్ఎస్ ఎస్ఏఐ లైసెన్స్ & రిజిస్ట్రేషన్ మేళాను నేడు నిర్వహిస్తున్నట్లు ఆహార భద్రత అధికారి సి.హెచ్.వినీల్ కుమార్ తెలి పారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. జిల్లా కలెక్టరేట్ (ఐడీ ఓసీ) భవనం లోని జీ2 గది లో ఉద యం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ మేళా నిర్వహించ నున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆహార పరిరక్షణ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతు న్నట్లు పేర్కొన్నారు. ఆహార వ్యాపార నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకుని ఎఫ్ఎస్ఎస్ఏఐ లై సెన్స్,రిజిస్ట్రేషన్లు పొందడం తోపాటు గడువు ముగిసిన లైసెన్సులను రెన్యు వల్ చేసుకోవాలని సూచించారు. మరి న్ని వివరాల కోసం ఆహార భద్రత అధి కారి 7306335795, గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ 9985820544 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# యుద్ధప్రాతిపదికన తాగునీటి సరఫరా పునరుద్ధరణ

ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా యుద్ధప్రాతిపదికన నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు మేయర్ మూడ్ గణేష్ తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 29 డివిజన్లకు త్రాగునీరు సరఫరా చేసే ఇల్లందు క్రాస్ రోడ్డులోని ఫిల్టర్ బెడ్ లోని విద్యుత్ సరఫరా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో విషయం తెలుసుకున్న మేయర్ వెంటనే ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి పరిస్థితిని సమీక్షించి అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో



ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఖమ్మం నుంచి తాత్కాలికంగా మరో ట్రాన్స్‌ఫార్మర్ తెప్పించి, ఇక్కడ బిగించి నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో నీటి సమస్యలు రాకుండా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో కొత్తగూడెం కార్పొరేషన్‌కు అమృత్ పథకంలో నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో నీటి పథకాలు, ఇతర నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని, త్వరలోనే ఈ పథకం పూర్తిగా అందుబాటులోకి వస్తుందని ఆయన వివరించారు. మేయర్ వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది వున్నారు.

## కల్నల్ సంతోష్ బాబు ఆల్ ఇండియా ఓపెన్ ఫిడె రెటెడ్ ర్యాపీడ్ చెస్ సెలెక్షన్స్ 2026



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: కల్నల్ సంతోష్ బాబు ఆల్ ఇండియా ఓపెన్ ఫిడె రెటెడ్ ర్యాపీడ్ చెస్ సెలెక్షన్స్ 2026 నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి, గండూరి కృపాకర్, ఎల్ సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 14 వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటలకు చెస్ సెలెక్షన్స్ స్థానిక (టి. టి. డి )కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారిని హైదరాబాద్ లో జరిగే ఆల్ ఇండియా స్థాయి చెస్ పోటీలకు పంపించబడతారని మరియు షీల్డ్స్, ప్రశంసా పత్రాలు అందిఇస్తామని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా చదరంగం క్రీడాకారులతో పాటు ఇతర జిల్లాల క్రీడాకారులు ఉపయోగించుకోవాలని వారు కోరారు. వివరాలకు ఎల్ సతీష్ కుమార్ కార్యదర్శి, చరవాణి నెం. 9394753343 సంప్రదించాలని తెలిపారు.

## అనఘాదేవికి వాయినాల కార్యక్రమం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలోని జమ్మిగడ్డలో గల దత్త సాయి మందిరం నందు గురువారం నాడు అధిక జేష్ట మాసం సందర్భంగా అనఘాదేవికి 33 రకాల వాయనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూలు పండ్లు స్వీట్లు గాజులు పసుపు కుంకుమలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు విష్ణు సహస్రనామ పారాయణము, లలిత సహస్రనామ పారాయణము, మణిద్వీప వర్ణన చేశారు. అర్చకులు రమణయ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన మహిళలందరికీ వాయినాలు అందజేశారు.

## ర్యాలీ కి ఆదివాసీ సంఘాలకు ఎలాంటి సంబంధం లేదు




ప్రజాస్ఫూర్తి , జన్నారం : ఈ నెల 10 వ తేదీ బుధవారం జరిగిన ర్యాలీకి మండలంలో ఉన్న నాలుగు ఆదివాసీ సంఘాలకు, 9 తెగలకు ఎలాంటి సంబంధం లేదని రాయిసెంటర్ సార్మేడి కొమ్ముగూడెంకు చెందిన పూసమ్ సోనేరావు, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు రాయిసిడం కాళీ, ఆదివాసి సంఘం మండల అధ్యక్షుడు యశ్వంథ్ రావు, రాజ్ గొండ్ సేవాసమితి అధ్యక్షుడు హన్మంతరావు, ఉపాధ్యక్షుడు వసంత్ లు తెలిపారు. గురువారం రోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసి సంఘాలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ర్యాలీకి పిలుపునిచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సైని కోరారు. మండల ఆదివాసీ సంఘాలకు సమాచారం ఇవ్వకుండా చేసే ర్యాలీలకు మండల ఆదివాసీలు, స్పందించవద్దని భవిష్యత్తులో మరొకసారి ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, బొజ్జు, ధర్ము, రాజేశ్వర్, ఆనంద్ రావు, భగవంతరావు, గంగు, మహేష్, భారిక్ రావు, జంగు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మొర్రిగూడ గ్రామంలో టీబీ క్యాంప్



ప్రజాస్ఫూర్తి , జన్నారం : టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ ఆధ్వర్యంలో బుధవారం రోజు జన్నారం మండలంలోని మొర్రిగూడ గ్రామంలో టీబీ క్యాంప్ నిర్వహించారు. రెండు వారాలకు మించి జ్వరం ఉన్నవారికి, 60 సంవత్సరాల వయసు పైబడిన 110 మందికి ఎక్స్రే మరియు 20 మందికి తెమడ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి విజయ లచ్చన్న, ఎంఎల్ హెచ్ పి పూజ, ఎస్ టి ఎస్ సురేష్, హెల్త్ అసిస్టెంట్ పోచయ్య, ఏఎన్ఎం వసంత మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈనెల 17 నుండి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ నుండి మూడు రోజులపాటు 'ప్రతి కూల పరిస్థితులలో సానుకూలంగా ఉండటం' అనే అంశంపై మూడురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కొత్తగూడెం బ్రహ్మకుమారీస్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెంలోని బాబుక్యాంప్‌లోగల బ్రహ్మకుమారీస్ ఆశ్రమం నందు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి డాక్టర్ సచిన్ పరాబ్ ముఖ్య వక్తగా హాజరవుతారని తెలిపారు. మూడురోజులపాటు ప్రతిరోజు ఉదయం 6.30 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు ఈ శిక్షణ తరగతులకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## బ్యూటీషియన్ తరగతులు ప్రారంభించిన మేయర్ గణేష్

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఎఎండిఆర్ ఫౌండేషన్ ఫర్ సోషల్ ఛేంజ్ ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత బ్యుటీషియన్ తరగతులను కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 మంది మహిళలకు మూడు నెలలపాటు స్వయం ఉపాధి కల్పించడానికి ఈ ఉచిత శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమన్నారు. మహిళలు బ్యుటీషియన్ కోర్సుల్లో నూతన పద్ధతులు నేర్చుకోవడానికి




ఈ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎఎండి ఫౌండేషన్ ఫౌండర్ అది, కోఫౌండర్ డాక్టర్ సాయిప్రసన్నలను మేయర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ లలితకుమారి, రమణారెడ్డి, షీటీం ఎస్ఐ రమాదేవి, టీపీసీసి సెక్రటరీ నాగా సీతారాములు, కార్పొరేటర్లు ఎస్.సుగుణ, భవిత, సరిత, సుప్రియ, ఏఐవైఎఫ్ డివిజన్ సెక్రటరీ ఫహీందాదా, కొత్వాల శ్రీనివాసరావు, ఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.పద్మ, వైస్ ప్రిన్సిపల్ పూర్ణచందర్ రావు, సర్పంచ్ అజ్మీరా లైలా, కిన్నెర వెంకన్న, అభిలాష్, గౌతమ్, నందు, కృష్ణ, ప్రణయ్, బ్యూటీషన్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించిన ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి

* **ప్రయాణికులతో మాట్లాడి సౌకర్యాల పై ఆరా.**

జనగామ, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి గురువారం సాయంత్రం జనగామ ఆర్టీసీ బస్టాండ్, డిపోను సందర్శించారు. ఇటీవల జనగామ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి ఎం. ఉషతో పాటు డిపో సిబ్బంది ఎండీకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బస్టాండ్ లోని వివిధ విభాగాలను స్వయంగా పరిశీలించిన అయన, ప్రయాణికులకు అందుతున్న సేవలు, సౌకర్యాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం పై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. అలాగే బస్టాండ్‌లోని వేచి వుండే ప్రదేశాలు, తాగునీటి సదుపాయం, పరిశుభ్రత, టికెట్ కౌంటర్లు, ప్రయాణికుల సమాచార వ్యవస్థ తదితర అంశాలను పరిశీలించారు. ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆర్టీసీ సేవల పై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. అధికారులు, సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవల పై సంతృప్తి వ్యక్తం చేశారు.




* **ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఉష బాధ్యతల స్వీకారం.. స్వాతి బదిలీ తో కొత్త డీఎంగా ఉష నియామకం.**

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఎం.ఉష గురువారం ఉదయం అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు డిపో మేనేజర్‌గా పనిచేసిన ఎస్.స్వాతి చెంగిచర్ల డిపోకు బదిలీ పై వెళ్లగా, ఆమె స్థానంలో ఉషను నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డిపోలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఉష, అధికారులు, సిబ్బందితో సమావేశమై డిపో పనితీరు, బస్సుల నిర్వహణ, ప్రయాణికుల సేవలపై సమీక్ష నిర్వహించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, బస్సుల సమయపాలన, సేవల నాణ్యత పెంపు పై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. అదే రోజు సాయంత్రం ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి డిపోను సందర్శించడం విశేషం. ఈ సందర్భంగా కొత్త డిపో మేనేజర్ ఉషకు ఎండీ పలు సూచనలు చేస్తూ, ప్రయాణికుల సంతృప్తే లక్ష్యంగా పనిచేయాలని సూచించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా వారు డిపో అభివృద్ధికి కృషి చేస్తూ సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచేందుకు కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష


హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా స్ట్రోమ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు. గతంలో భారీ వర్షాల కారణంగా పలు కాలనీల్లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని



అధికారులను ఆదేశించారు. అలాగే మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనుల పురోగతి ఎల్లమ్మ చెరువు అభివృద్ధి పనులు, పట్టణంలో కొనసాగుతున్న ఇతర అభివృద్ధి కార్య క్రమాలపై అధికారులతో చర్చించి పనులు వేగవంతం చేయాలని సూచిం చారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అభివృద్ధి పనుల్లో నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోపు పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తరి పద్మ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మున్సిపల్ కౌన్సిలర్లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నర్సారెడ్డి భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్ :టీపీసీసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ,కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ,నర్సాపూర్ నియోజకవర్గ



ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులు సుధీర్ రెడ్డి, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ ,ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం ,రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్ , రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ అజయ్ రాజు ,జిల్లా గ్రంధాలయం సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి ,మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు నియోజకవర్గ ముఖ్య నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజల ఆశీస్సులతో ప్రజాసేవలో కొనసాగుతున్నా

**: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**



జనగామ, ప్రజాస్ఫూర్తి : గత ఏడాది ఇదే రోజున జరిగిన ప్రమాదంలో తీవ్రం గా గాయపడి శస్త్రచికిత్స చేయించు కున్న అనంతరం ప్రస్తుతం సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో కొనసాగుతున్నానని నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా రాజే శ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం విడు దల చేసిన ప్రకటనలో ఆయన తనకు అండగా నిలిచిన వైద్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నియో జకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్య ల పరిష్కారం కోసం నిరంతరం కృషి చే స్తున్నానని పేర్కొన్నారు. విద్యార్థులకు అనురాగ్ యూనివర్సిటీ ద్వారా ఫీజు రాయితీలు, పేదలకు నీలిమ హాస్పిటల్ ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తున్న ట్లు తెలిపారు. 2023లో ప్రజలు తన పై నమ్మకం తో ఎమ్మెల్యేగా గెలిపించారని, గత రెండున్నర సంవత్సరాలుగా ప్రజల తో కలిసి అభివృద్ధి బాటలో ముందుకు సాగుతున్నామని అన్నారు. ప్రజలుతన పై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుం టూ గ్రామాల అభివృద్ధి, ప్రజలసంక్షేమం కోసం మరింత బాధ్యత తో పనిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## గో టు విలేజ్ ను విజయవంతం చేయాలి

**- బోయ లింగస్వామి మాదిగ**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గో టు విలేజ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ అన్నారు. చౌటుప్పల్ మండలం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్ లో మండల అధ్యక్షుడు బొడ్డు శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బోయ లింగస్వామి మాదిగ మాట్లాడుతూ దేశంలో అనేకమైన సామాజిక ఉద్యమాలు సృష్టించి విజయం సాధించిన చరిత్ర ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి ఉందన్నారు. ఎక్కడ ఏ జాతికి అన్యాయం జరిగిన న్యాయం వైపు ఉండి కొట్లాడే సంఘం ఎమ్మార్పీఎస్ అన్నారు. రాష్ట్రంలో వచ్చిన ఆరోగ్యశ్రీ పథకం, వికలాంగుల, వితంతువుల పింఛన్లు ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితమేనన్నారు. అదే విధంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఎమ్మార్పీఎస్ ది కీలక పాత్రన్నారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామాలకు తరలండి (గో టు విలేజ్) కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బోయ రాము, ఎమ్మార్పీఎస్ మున్సిపల్ అధ్యక్షుడు ఎర్ర శంకర్, ఎమ్మార్పీఎస్ తాళ్ళసింగారం గ్రామ శాఖ అధ్యక్షుడు దోనకోండ కీరణ్ కూమార్, ఊదరి యాదయ్య, బోయ జోసఫ్, బోయ సృజన్ తదితరులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ అవిరేని యాదగిరికి ఎస్పీ ప్రశంస



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండల కేంద్రంలోని కృష్ణానగర్ కాలనీకి చెందిన హెడ్ కానిస్టేబుల్ అవిరేని యాదగిరి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ చేతుల మీదుగా గురువారం ప్రశంస పొందారు. గత రెండు నెలలుగా భువనగిరి రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న అవిరేని యాదగిరి గత రెండు మాసాలుగా జిల్లా కేంద్రంలో జరిగిన నాలుగు హత్య కేసులను ఛేదించడంలో కీలక భూమిక పోషించారు. రూరల్ సీఐ ఎన్ చంద్రబాబు కు సహకరించి కేసులు గుర్తించడంలో కీలక పాత్ర వహించారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన క్రైమ్ సమావేశంలో జిల్లా పోలీస్ అధికారుల సమక్షంలో ఎస్పీ అక్షాంశ్ యాదవ్ చేతుల మీదుగా ప్రశంసలు, రివార్డ్ అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పోలీస్ అధికారులు యాదగిరిని ప్రత్యేకంగా అభినందించారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తులను ఈజీగా పట్టుకోవచ్చు

*** జిల్లా ఎస్పీ డా. శబరీష్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీలతో మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పారదర్శకత, జవాబుదారీతనం, సేవల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు క్రైమ్, క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ సిస్టమ్స్ ను వంద శాతం సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను ఎఫ్ఐఆర్ నమోదు దశ నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు తప్పనిసరిగా సీసీటీఎన్ఎస్ లో నమోదు చేసి, ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే ఆలస్యం చేయకుండా ఆన్‌లైన్ ఎంట్రీ చేయాలని, దర్యాప్తు పురోగతి, నిందితుల వివరాలు, కేసు స్థితిగతులను సకాలంలో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ ద్వారా పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, క్యారెక్టర్ సర్టిఫికెట్లు, దొంగిలించబడిన వాహనాల ట్రాకింగ్ వంటి ప్రజా సేవలను వేగవంతంగా అందించవచ్చని పేర్కొన్నారు. ఈ వ్యవస్థ అమలులో నిర్లక్ష్యం లేదా అలసత్వం సహించబోమని హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లాను మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని ఎస్పీ సూచించారు. గంజాయి విక్రేతలు, రవాణాదారులు, పాత గంజాయి కేసుల నిందితులు, మాదకద్రవ్యాలకు సంబంధించిన నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు.వారి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట కౌన్సిలింగ్ నిర్వహించాలని, మళ్లీ నేరాలకు పాల్పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు, వాహనాల తనిఖీలు, విస్తృత నిఘా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి, కార్డన్ అండ్ సెర్చ్,కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలలో భద్రత భావం తీసుకురావాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా క్షేత్రస్థాయిలో కఠిన అమలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## ఇంప్రూవ్ మెంట్ లో ఎస్ ఆర్ కాలేజ్ ప్రతిభ

*** మొదటి స్థానంలో పదుల సంఖ్యలో విద్యార్థులు .**




ప్రజా స్ఫూర్తి, నల్గొండ : తెలంగాణ ప్రభుత్వం గురువారం విడుదల చేసిన ఇంటర్ సప్లీమెంటరీ, ఇంప్రూవ్ మెంట్ ఫలితాల్లో నల్లగొండ రామగిరి లో గల ఎస్ ఆర్ కాలేజ్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఇద్దరు విద్యార్థులు 468 మార్కులు సాధించగా, ఏడుగురు 467మార్కులతో సత్తా చాటారు. అదే విధంగా ముగ్గురికి 465 మార్కులు వచ్చాయి. బైపీసి విభాగంలో ఒకరికి 438 మార్కులు రాగ, ఇంకోరికి 327, మరో ఇద్దరికీ 436 మార్కులు వచ్చాయి. ఇంప్రూవ్మెంట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎస్ ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, సీఈఓ సురేందర్ రెడ్డి, జోనల్ ఇంచార్జి దోనాల శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ జోనల్ సతీష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మనోజ్ రెడ్డి ఇతర అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

## భద్రాచలంలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు గురువారం భద్రాచలం పట్టణంలోని లాడ్జీలు, బస్టాండ్‌లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అనుమానిత వ్యక్తులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులే ధ్యేయంగా సోదాలు చేపట్టామని డిఎస్పి అరుణ్ కుమార్ తెలిపారు. భద్రాచలం పట్టణంలోని మొత్తం 62 లాడ్జిలతోపాటు స్థానిక బస్టాండ్ పరిసర ప్రాంతాలలో ఈ తనిఖీలు కొనసాగాయి. ఫింగర్ ప్రింట్ డివైస్‌లు, డాగ్ స్క్వాడ్ బృందాలతో లాడ్జిలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. సోదాల సమయంలో లాడ్జిల యజమానులు, మేనేజర్లు, సిబ్బంది యొక్క పూర్తి వివరాలు సేకరించి, లాడ్జిలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. సీసీ టీవీ ఫుటేజ్ కనీసం 2 నెలల పాటు బ్యాకప్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. లాడ్జి వెలుపల రహదారిపై వచ్చిపోయే వాహనాల కదలికలను స్పష్టంగా రికార్డు అయ్యేలా కెమెరాలను రోడ్డు వైపు అమర్చాలని ఆదేశించారు. పట్టణ ప్రజల భద్రత దృష్ట్యా ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు. ఎవరైనా అనుమానస్పదంగా కనిపించినట్లయితే పోలీస్ వారికి తెలియజేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, స్పెషల్ పార్టీ సిబ్బంది, మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజ సేవలో అందరూ భాగస్వాములు కావాలి

*** బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. సిఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి బండారి లేఔట్ లో పద్మావతి ఆధ్వర్యంలో గ్రంథాలయం వద్ద గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన త్రాగునీటి వాటర్ ట్యాంక్ ను ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయానికి వచ్చే వారికి, పాదాచారులకు ఉపయోగపడేలా త్రాగునీటి వాటర్ ట్యాంకును ఏర్పాటుచేసిన పద్మావతి కి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సాబేర్ అలీ, ఇరిగేషన్ డీఈ నాయక్, ఈఈ సురేష్ బాబు, వాటర్ వర్క్స్ మేనేజర్ సౌమ్య, ఏఈ రవీంద్ర నాయక్, ఇంజనీరింగ్ ఏఈ ప్రవీణ్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ జ్యోతి నరసింహారెడ్డి, చందు ముదిరాజ్, ఆగం రాజు, బాలాజీ నాయక్, మేకల వెంకటేష్, గాజుల సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, సంక్షేమ సంఘం అధ్యక్షులు నరసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు నరసింహారాజు, కాలనీ వాసులు జొన్నలగడ్డ రవి, పద్మావతి, లక్ష్మి కుమారి, భారతి, శ్రీదేవి, మాన్య, సీనియర్ నాయకులు శ్రీకర్ గుప్తా, సాంబశివరెడ్డి, బొబ్బ శ్రీనివాస్, సతీష్ రెడ్డి, బిక్షపతి, ప్రదీప్ తాలూరి, స్వామి, ముత్యాలు, చంద్రయ్య, ఎండి.సలీం, మహిళా నాయకురాల్లు అర్పిత ప్రకాష్, నర్మదా, స్వర్ణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే

*** ప్రముఖ చేతి రాత నిపుణులు ఏజాస్ అహ్మద్**





జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ప్రముఖ చేతి రాత నిపుణులు ఏజాస్ అహ్మద్ అన్నారు. గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్ లో గల ఠాగూర్స్ హై స్కూల్ లో ఉపాధ్యాయులకు విద్యా భోధనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులకు భోధన విషయంలో పలు మేళకువలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని మంచి మార్గంలో నడిపించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులు రోల్ మోడల్గా నిలువాలన్నారు. పదవ తరగతిలో మంచి మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధిస్తే భవిష్యత్ లో ఎంతో ఉపయోగపడుతాయన్నారు. అనుకున్న లక్ష్యంతో ముందుకెళ్ళాలన్నారు. అంతకు ముందు పదవ తరగతి విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులపై , చేతి రాత పై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ బండారు సాయికుమార్ మాట్లాడుతూ ముందు ముందు ఉపాధ్యాయులకు సాంకేతిక పరంగా ప్రముఖులచే శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఇక్కుర్తి నారాయణ రావు, డాక్టర్ శాంతి భూషణ్, బి.దుర్గయ్య, పాఠశాల డైరెక్టర్ బండారు నేహా, ఉపాధ్యాయులు శివ గోపి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఎన్ డి పి పనుల ద్వారా బండారి లేఔట్ లో వరద ముంపు తీవ్రతను తగ్గించాం

*** బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, పీపుల్స్ న్యూస్ : గతంలో ఎస్ ఎన్ డి పి పనుల ద్వారా బండారి లేఔట్ లో వరద ముంపు తీవ్రతను తగ్గించామని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. గురువారం సిఎంసి నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ పరిధి బండారి లేఅవుట్, తుర్క చెరువు ప్రాంతాలలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రజా సమస్యలపై అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు లో ప్రెజర్ తో నీటి సరఫరా, లైబ్రరీ పైకప్పు లీకేజీ, ఒంటరి మహిళలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు, నూతన రేషన్ కార్డులు, పెన్షన్లు, ఎస్ఎన్డిపి పనుల వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వర్షం వచ్చిన ప్రతిసారి బండారి లేఔట్ లోని ప్రజలు వరద నీటి సమస్యతో భయాందోళనకు గురయ్యేవారని అన్నారు. గత 12 ఏళ్ల కాలంలో ఎస్ఎన్డిపి పనుల ద్వారా వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. బండారి లేఔట్ లోని లైబ్రరీ పైకప్పు లీకేజీ సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి పైకప్పు లీకేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయింప చేయడంతో పాటు పెన్షన్లను, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి రేషన్ కార్డులను ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు., రానున్న రోజుల్లో కూడా ఎస్ ఎన్ డి పి ఫేస్ 2 పనులను త్వరితగతిన పూర్తి చేసి వరద ముంపు సమస్యకు శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులతో కలసి తుర్క చెరువును సందర్శించిన ఎమ్మెల్యే చెరువులో మురుగునీరు కలవకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మురుగునీటిని బయటకు పంపించి వాకింగ్ ట్రాక్, పిల్లల కోసం ఆట సామాగ్రి తో పాటు చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సాబేర్ అలీ, ఇరిగేషన్ డీఈ నాయక్, ఈఈ సురేష్ బాబు, వాటర్ వర్క్స్ మేనేజర్ సౌమ్య, ఏఈ రవీంద్ర నాయక్, ఇంజనీరింగ్ ఏఈ ప్రవీణ్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ జ్యోతి నరసింహారెడ్డి, చందు ముదిరాజ్, ఆగం రాజు, బాలాజీ నాయక్, గాజుల సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, సంక్షేమ సంఘం అధ్యక్షులు నరసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు నరసింహారాజు, సీనియర్ నాయకులు జొన్నలగడ్డ రవి, పద్మావతి, లక్ష్మీ కుమారి, భారతి, శ్రీదేవి, మాన్య తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

*** ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్.**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని శాఖల వారీగా ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఎఐవైఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు.ఈ మేరకు జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు ఎఐవైఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు.అలాగే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలకు బదులుగా శాశ్వత నియామకాలు చేపట్టాలని, టీజీపీఎస్సీ ద్వారా వార్షిక నియామక క్యాలెండర్ విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యా, వైద్య రంగాల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అంతయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బిచ్చాల శ్రీనివాస్ ఎండీ అయూబ్ దండుగుల రాజు శ్రీనివాస్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవుల అవగాహన సదస్సును విజయవంతం చేయండి

*** పి. డేవిడ్ రాజ్**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ఈనెల 13న నల్లగొండలో నిర్వహించే దళిత క్రైస్తవుల అవగాహన సదస్సును విజయవంతం చేయాలని ఏఐసిఎఫ్ ఉమ్మడి నల్లగొండ కోఆర్డినేటర్ పి. డేవిడ్ రాజ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని గడియారం సెంటర్ సమీపంలో గల సెల్ఫ్ బాప్టిస్ట్ చర్చ్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ను తొలగించాలని డిమాండ్ చేస్తూ నల్లగొండలోని లక్ష్మీ గార్డెన్లో నిర్వహించే అవగాహన సదస్సుకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, అదేవిధంగా ఏఐసిఎఫ్ జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు తో పాటు క్రైస్తవ నాయకులు, పలువురు వక్తలు హాజరవుతున్నారని తెలిపారు. దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించి వారిపై చూపిస్తున్న వివక్షను వెంటనే తొలగించాలని అందరితోపాటు వారిని కూడా సమానంగా చూడాలని కోరారు. దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించకపోతే దళిత సంఘాల నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈనెల 13న జరిగే క్రైస్తవ సదస్సుకు జిల్లావ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు అధిక సంఖ్యలో తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సెల్ఫ్ బాప్టిస్ట్ చర్చి ప్రెసిడెంట్ క్రిస్టఫర్, ఆర్సీఎం చర్చి ఫాదర్ జీవన్, బిషప్ సమర్పన్ కుమార్, హెబ్రోన్ సేవకులు జాకోబు రిటైర్డ్ సూపరింటెంట్ ఇంజనీర్ చిట్యాల పాల్ రాజ్ , హెడ్ మాస్టర్ ప్రభు దాస్, డి. ప్రేమ్ కుమార్, మేడి లక్ష్మయ్య, శౌరయ్య, యాచారం యాకోబ్, చింత సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రజా ఉద్య మంగా నిర్వహించి పచ్చదనం పెంపొం దించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమా ర్ ఝా అధికారులకు సూచించారు. జి ల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో 25. 92 లక్షల మొక్కలు నాటేందుకు చర్య లు చేపట్టాలని ఆదేశించారు.మొక్కల సంరక్షణ పై ప్రత్యేక దృష్టి పెట్టి నాటడ మే కాకుండా వాటి సంరక్షణకు ప్రాధా న్యత ఇవ్వాలని, ప్రభుత్వ కార్యాలయా లు, విద్యాసంస్థలు, గ్రామ పంచాయతీ లు,రహదారుల వెంట విస్తృతంగా మొ క్కలు నాటాలని కలెక్టర్ సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సా మాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల ను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. జిల్లాకు మంజూరైన 5, 755 ఇళ్లలో 5,037 ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తైందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప ర్యవేక్షణ పెంచాలి ఇంజనీరింగ్ అధికారులు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటి స్తూ నిర్మాణాల పురోగతిని పర్యవేక్షిం చాలని, ప్రతి వారం కనీసం 20 ఇళ్లను తుది దశకు తీసుకురావాలని సూచిం చారు. నాణ్యత ప్రమాణాలతో పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదే శించారు. సమావేశంలో డీఆర్డీఓ భాస్క ర్, డీపీఓ వెంకట్ రెడ్డి, ఎక్సైజ్ ఎస్పీ అ నిత, ఎఫ్ఆర్ఓ భాస్కర్,గృహ నిర్మాణ శాఖ పీ.డీ మాతృ నాయక్, డీఈలు, ఏ.ఈ లు తదితర అధికారులు పాల్గొ న్నారు.

# నాణ్యమైన విద్యను అందించడం పైనే ఉపాధ్యాయులు దృష్టి సారించాలి

*** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



నల్గొండ, ప్రజాస్ఫూర్తి : గురువారం కలెక్టర్ బి చంద్రశేఖర్ బొట్టుగూడ కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, పరిసరాలు, డైనింగ్, లైబ్రరీ, క్రీడా పరికరాలు, తదితరాలను తనిఖీ చేశారు.పాఠశాల ద్వారా గుణాత్మక విద్యతో పాటు, పరిసరాలు కూడా ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేలా చూడాలని, టాయిలెట్స్ ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, తరగతి గదులు, పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉండాలని, పాఠశాలలు ప్రారంభం అవుతున్న దృష్ట్యా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు పాఠశాల పక్కనే ఉన్న స్థలంలో తాత్కాలికంగా కిచెన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే తరగతి గదిలో ఏసీలు వినియోగించేటప్పుడు తరగతి గదులు మూసి ఉంచాలని, పాఠశాలలోని లైబ్రరీ, గేమ్స్ ,ఇతర అన్ని పరికరాలు విద్యార్థులు వినియోగించుకునే విధంగా చూడడమే కాకుండా వాటిని జాగ్రత్తగా సంరక్షించాలన్నారు. పాఠశాలలో పచ్చదనం ఉండే విధంగా మొక్కలకు నిరంతరం నీరందించాలని, మొక్కలు ఎండిపోకుండా చూడాలని, పాఠశాల ఆవరణలోకి వాహనాలు రాకుండా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్ వెంట నల్గొండ ఎంఇఓ అరుంధతి, పాఠశాల హెడ్మాస్టర్, తదితరులు ఉన్నారు.

# సాదా బైనామా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి

*** జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**




ప్రజాస్ఫూర్తి , జన్నారం: సాదా బైనామా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం రోజున మంచిర్యాల జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట మండలాలలోని తహసిల్దార్ కార్యాలయాలను సందర్శించి సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు మాట్లాడుతూ సాదా బైనమా దరఖాస్తుల పరిష్కరణలో భాగంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి భూభారతి పోర్టల్ ను అందుబాటులోకి తీసుకువచ్చి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, విరాసత్ తదితర సేవల ద్వారా నిబంధనల ప్రకారం భూ సంబంధిత సేవలను వేగవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 25వ తేదీ నుంచి కార్యక్రమం నిర్వహించనున్న దృష్ట్యా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సక్రమంగా నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, సూపర్వైజర్లు, ఎ ఈ ఆర్ ఓ లు పనుల పురోగతిని పరిశీలించాలని తెలిపారు. ఈ క్రమంలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కరణ వేగవంతం చేయాలని తెలిపారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.

# గర్భస్థ శిశువుల లింగ నిర్ధారణపై ఉక్కుపాదం

*** నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : గర్భస్థ శిశువుల లింగ నిర్ధారణను పూర్తిగా అరికట్టేందుకు జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. పీసీ-పీఎన్‌డీటీ చట్టం, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు అమలుపై గురువారం ఐడీఓసీ కార్యాలయంలో వైద్య, పోలీసు శాఖల అధికారులు, ఐఎంఏ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగ నిర్ధారణకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సంస్థలు తప్పనిసరిగా నమోదు ప్రక్రియ పూర్తి చేసి, చట్ట నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శక వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.సమావేశంలో జిల్లా వైద్యాధికారి డా. మధుసూదన్, ఐఎంఏ అధ్యక్షుడు డా. కె.ఎస్. కిరణ్, మాలి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సదానందం, డిప్యూటీ వైద్యాధికారి డా. శ్రీదేవి, డెమో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# కాపర్ వైర్ ఆయిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా ముఠా అరెస్ట్



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర పరిధిలోని వివిధ జిల్లాలలో వరుసగా ట్రాన్స్ఫార్మర్ లోని కాపర్ వైర్ ఆయిల్ దొంగతనాలకు పాల్పడుతున్న గ్యాంగ్ లీడర్ హమీద్ హుస్సేన్ అతని గ్యాంగ్ ఐదుగురు రోహింగ్య నిందితులను జిల్లా పోలీసులు అరెస్టు చేసినట్లు నల్లగొండ డి.ఎస్.పి కె. శివరాం రెడ్డి వెల్లడించారు. గురువారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కాలంలో పెరుగుతున్న ట్రాన్సఫార్మర్ లోని కాపర్ వైర్, ఆయిల్, అల్యూమినియం వైర్ దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఆదేశాల మేరకు నార్కట్‌పల్లి పోలీసులు అప్రమత్తంగా నిఘా నిర్వహించి నిందితులను అరెస్ట్ చేసి, కోర్టు లో ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తేదీ: 17 122025 న ఉదయం సమయంలో నెల్లుట్ల చందు కుమార్, నార్కట్‌పల్లిలోని కళ్యాణి స్టీల్ లిమిటెడ్ కంపెనీకి అడ్మిన్ ఇన్‌చార్జ్, పనిచేస్తూ వనస్థలిపురం, హైదరాబాద్ లో అతను తన పని చేస్తున్న కంపెనీలోని ట్రాన్స్ఫార్మర్లలో, 21 వేల లీటర్ల ట్రాన్స్ఫార్మర్ ఆయిల్, కాపర్ కాయిల్స్ 220కేవీ ట్రాన్స్ఫార్మర్ మర్ నుండి ఓల్టీసీ ఆన్ లోడ్ టాప్ చేంజర్ యొక్క 3 హచ్ వి , 3 ఎల్ వి కాపర్ ఎలిమెంట్స్ కాపర్ వైర్ పోయిందని నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, నార్కట్‌పల్లి ఎస్ఐ కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారని తెలిపారు.ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం 3:00 గంటలకు నార్కట్‌పల్లి గ్రామ శివారులోని ఎన్ హెచ్ 65 రోడ్డుపై హైదరాబాద్ నుండి విజయవాడ వైపు వెళ్లే మార్గంలో రెడ్డయ్య ఫ్యాక్టరీ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, మూడు బైక్‌లపై వస్తున్న ఐదుగురు వ్యక్తులను ఆపి తనిఖీ చేశారని బైక్‌లకు సంబంధించిన సరైన పత్రాలు చూపించకపోవడంతో పాటు అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారని తెలిపారు .ఈ విచారణలో వారు పలు ట్రాన్స్ఫార్మర్లలోని కాపర్ వైర్, ఆయిల్ అల్యూమినియం వైర్ దొంగతనాలకు పాల్పడినట్లు హమీద్ హుస్సేన్, జహంగీర్ ఆలం, నూర్ కాసిం, నూరుల్ అమీన్, నూరుల్ ఆలం అలియాస్ మహబూబ్ ఆలం, ఒప్పుకున్నారని వీరిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రెండు లక్షల విలువగల 3 బైకులు 7,71,000 రూపాయలనగదు,2 కట్టర్లు,4 పానాలు,హ్యాండ్ గ్లౌజెస్ స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.ఈ కేసును సమర్థవంతంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో కీలక పాత్ర పోషించిన సి సి ఎస్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డి, నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐ సతీష్‌వర్మ, నార్కట్‌పల్లి ఎస్ఐ విష్ణుమూర్తి, హెడ్ కానిస్టేబుళ్లు విష్ణువర్ధన్ గిరి, పుష్పగిరి, వహీద్ పాషా, కానిస్టేబుళ్లు అస్రార్, శివరాజ్, నరేష్, జునేద్, కమల్ కిషోర్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# ఏఎంఆర్పి హై లెవెల్ కెనాల్ లైనింగ్ పనులు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి



నల్లగొండ, , ప్రజాస్ఫూర్తి : సుమారు 442 కోట్ల రూపాయలతో చేపట్టిన ఏఎమ్మార్పీ హై లెవెల్ కెనాల్ లైనింగ్ పనులను జూలైలోపు సాధ్యమైనంత వరకు పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఆదేశించారు.గురువారం ఆయన నల్గొండ మండల , నర్సింగ్ బట్ల, కుదవన్ పూర్, గుండ్లపల్లి వద్ద ఏ ఎంఆర్పి హై లెవెల్ కెనాల్ లైనింగ్ పనులను పరిశీలించారు. పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి పనులను ఇంకా వేగవంతం చేయాలని, జూలై 31లోగా ఎంత ఎక్కువ వీలైతే అంత ఎక్కువ పనులు పూర్తి చేసి ఎక్కువ నీరు సులభంగా కిందికి వెళ్లేలా చూడాలని అన్నారు. లైనింగ్ కోసం తాను ప్రత్యేకించి రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి 442 కోట్ల రూపాయలను మంజూరు చేయించడం జరిగిందని ,దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులకు మేలు కలిగే విధంగా ఈ వానకాలం పంటకు ఎక్కువ నీరు కిందికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా ఏఎంఆర్పి కాల్వల లైనింగ్ అంగడిపేట నుండి మొదలుకొని మూసీ వరకు సుమారు 136కిలోమీటర్ల వరకు చేపట్టడం జరుగుతున్నది. 1985 86 లో జరిగిన ఎంఆర్పి కాలువ తవ్వకం పూర్తికాగా, 40 సంవత్సరాల తర్వాత రాష్ట్ర రోడ్లు, భవనాలు , సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో లైనింగ్ పనులకు నిధులు మంజూరు అయ్యాయి. కాలువ లైనింగ్ పనులు పూర్తయితే రెండు లక్షల ఇరవై వేల ఎకరాలకు సాగునీటిని సులభంగా అందించవచ్చు. ప్రస్తుతం లైనింగ్ లేనందువల్ల ఆయకట్టు చివరి భూములకు నీరంధక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. లైనింగ్ పూర్తి అయితే కాలువలో సులభంగా నీరు ప్రవహించి త్వరగా చివరి వరకు చేరుతుంది అంతేకాక ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించే అవకాశం ఉందిమంత్రి వెంట ఇరిగేషన్ సి ఈ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ ఈ భద్రు ,ఈ ఈ నెహ్రూ నాయక్,ఇతర ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు ఉన్నారు .

# మెదక్ ఖిల్లాకు దేశస్థాయిలో గుర్తింపు తేవాలి

*** జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ జిల్లాకు దేశస్థాయిలో గుర్తింపు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్ సహకారంతో మెదక్ ఖిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి రాష్ట్ర, దేశ స్థాయిలో ముందుచ్చుతామని దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అదనపు కలెక్టర్ నగేష్ ఇతర అధికారులు, మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్ తో మెదక్ ఖిల్లా ను సందర్శించారు. మెదక్ ఖిల్లపైన ఉన్న గజశాల, దర్వాజాలు,జైలును తదితర చారిత్రక అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.మెదక్ ఖిల్ల పైన ఎక్కడ డ్యామేజ్ అయింది, ఎక్కడ శిథిలావస్థకు చేరింది అనే అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు.ఖిల్లా పైన అడ్డదిడ్డంగా పెరిగిన చెట్ల మొక్కలను, ముళ్ల పొదలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. మెదక్ జిల్లాలో దొరికిన పురావస్తు విగ్రహాలు, తదితర శాసనాలు, వివిధ అంశాలతో మెదక్ ఖిల్లపై మ్యూజియంను ఏర్పాటు చేసి మెదక్ జిల్లా చరిత్రను చెప్పే విధంగా పర్యాటకులకు అందుబాటులో ఉంచుతామన్నారు.జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీం కింద నిధులు తీసుకొచ్చి మెదక్ జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామన్నారు.మెదక్ ఖిల్లాపై లెదర్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు.రాబోవు రోజుల్లో ఖిల్లా పై సాంస్కృతిక కార్యక్రమాలు చేయడానికి అనువైన ప్రదేశం అని కొనియాడారు.మెదక్ జిల్లా హైదరాబాద్ కు దగ్గరగా ఉన్నటువంటి నేపథ్యంలో జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలను గుర్తించి మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

# గూడూరులోని తిరుమల నర్సింగ్ హోమ్ హాస్పటల్ ఆకస్మిక తనిఖీ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: గూడూరు మండలంలోని ప్రైవేట్ ఆస్పత్రి తిరుమల నర్సింగ్ హోమ్ ను అనుమానస్పద గర్భాస్రావం జరిగినదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రవి రాథోడ్ తన బృందంతో అకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ తనిఖీలలో లావుడియా జ్యోతిక భర్త గణేష్ పుల్లయ్యబోడు తండా, చెన్నారావుపేట మండలం, పరిశీలించగా అనుమానస్పద కుటుంబ నియంత్రణ ట్యూబెక్టమీ ఆపరేషన్ జరిగినదని,హాస్పిటల్ యొక్క రికార్డులను, కేసు యొక్క షీట్లను,ఇతర సంబంధిత పత్రాలను స్వాధీన పరుచుకొని, ఈ కేసు మహబూబాబాద్ జిల్లా పరిదిలో నిది కానందున, ఈ కేసు వరంగల్ జిల్లా పరిధిలోనిది. పూర్తి సమాచారం కొరకు వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని సంప్రదించడం జరుగుతుంది.ఈ సందర్భంగా ఆసుపత్రి యొక్క ఆపరేషన్ థియేటర్ ను సీజ్ చేశారు.

# ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

*** మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : సుమారు 14,500 కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించనున్న హ్యాం రోడ్ల శంకుస్థాపన నిమిత్తం ఈ నెల 17 న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా, కనగల్ వస్తున్న దృష్ట్యా రాష్ట్ర ముఖ్యమంత్రి రాకకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఆర్ అండ్ బి అధికారులు, సంబంధిత జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న హ్యాం రోడ్ల పైలాన్, బహిరంగ సభ నిర్వహించే ప్రదేశం, బహిరంగ సభకు ఏర్పాట్లు, ఇతర ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. హ్యాం రోడ్లతోపాటు, మరి కొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చే ఇక్కడ నుండే శంకుస్థాపనలు నిర్వహించే విషయమై సమావేశంలో మంత్రి అధికారులతోచర్చించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ , జిల్లా అధికారులతో కలిసి గురువారమే కనగల్ వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభకు, హ్యాం రోడ్ల శంకుస్థాపనకు స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, అలాగే పైలాన్ ఏర్పాటు చేసే స్థలం , బందోబస్తుతో సహా పరిశీలించి నట్లు వెల్లడించారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి,డి ఈ గణేష్, జెడ్పిసిఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఈ సమావేశంలో ఉన్నారు .

# ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

*** మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : సుమారు 14,500 కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించనున్న హ్యాం రోడ్ల శంకుస్థాపన నిమిత్తం ఈ నెల 17 న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా, కనగల్ వస్తున్న దృష్ట్యా రాష్ట్ర ముఖ్యమంత్రి రాకకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు.గురువారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తోకలిసి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవర్, ఆర్ అండ్ బి అధికారులు, సంబంధిత జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు.ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న హ్యాం రోడ్ల పైలాన్, బహిరంగ సభ నిర్వహించే ప్రదేశం,బహిరంగ సభకు ఏర్పాట్లు, ఇతర ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. హ్యాం రోడ్లతోపాటు, మరి కొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చే ఇక్కడ నుండే శంకుస్థాపనలు నిర్వహించే విషయమై సమావేశంలో మంత్రి అధికారులతో చర్చించారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి తో ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ తల్లి దర్శనం చేయించి ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని ఆధునికరించేందుకు చర్యలు తీసుకుంటున్నందున అవకాశం ఉంటే దేవాలయ ఆధునికరణ పనులకు కూడా ఎల్లమ్మ తల్లి దేవాలయం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రితో శంకుస్థాపన చేయించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి తెలిపారు. శిలాఫలకం, ఇతర ఏర్పాట్లపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి కేంద్రీకరించాలని కోరారు. అనంతరం హ్యాం రోడ్ల శంకుస్థాపన, బహిరంగ సభకు హాజరయ్యే విధంగా ప్రాథమికంగా ఏర్పాట్లు చేసేలా మంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు అధికారులు అందరూ సమిష్టిగా కృషి చేయాలని చెప్పారు. అంతేకాక సభకు హాజరయ్యే ప్రజల కోసం టెంట్లు, కుర్చీలు, తాగునీరు, ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయాలని, ఏర్పాట్లలో ఎక్కడ లోపం లేకుండా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ , జిల్లా అధికారులతో కలిసి గురువారమే కనగల్ వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభకు,హ్యాం రోడ్ల శంకుస్థాపనకు స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, అలాగే పైలాన్ ఏర్పాటు చేసే స్థలం , బందోబస్తుతో సహా పరిశీలించి నట్లు వెల్లడించారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి,డి ఈ గణేష్, జెడ్పిసిఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఈ సమావేశంలో ఉన్నారు .

# వర్షాకాలంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

* **అధికారులను ఆదేశించిన మంత్రి పొన్నం ప్రభాకర్.**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ బస్ స్టేషన్‌లో వర్షాకాలంలో ఏర్పడుతున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి హుస్నాబాద్ బస్ స్టేషన్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా బస్ స్టేషన్‌లోని ప్రయాణికులతో నేరుగా మాట్లాడిన మంత్రి, బస్సుల రాకపోకలు మౌలిక సదుపాయాలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాల సమయంలో వరద ప్రభావంతో బస్ స్టేషన్‌లో నీరు నిల్వ ఉండడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి, వెంటనే తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. బస్ స్టేషన్ వెనుక భాగంలో ఉన్న నాలాను ప్రధాన డ్రైనేజీ వ్యవస్థకు అనుసంధానం చేసేలా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీర్లు, ఆర్టీసీ అధికారులకు మంత్రి ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ లేకుండా చేసి ప్రయాణికుల కు మెరుగైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, హుస్నాబాద్ ప్రజలు వర్షాకాలంలో బస్ స్టేషన్ సమస్యలపై తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఆర్టీసీ ఎండీ, అధికారులతో కలిసి పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. రోజుకు సుమారు 35 వేల మంది ప్రయాణికులు ఈ బస్ స్టేషన్‌ను వినియోగిస్తున్నారని రెవెన్యూ పరంగా రాష్ట్రంలో ప్రముఖ బస్ స్టేషన్లలో ఇది ఒకటని చెప్పారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తరి పద్మ, కౌన్సిలర్లు ఆర్టీసీ అధికారులు ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రాజకీయ ప్రయోజనాల కోసమే భాజపాపై ప్రతిపక్షాల విమర్శలు



సిద్దిపేట: గతంలో ఎస్ఐఆర్ నిర్వహించినప్పుడు భాజపా మద్దతిచ్చిందని, ఇప్పుడు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు భాజపాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండలం మాత్‌పల్లిలో నిర్వహిస్తున్న భాజపా జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో రామచందర్‌రావు పాల్గొని మాట్లాడారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రాంతంలోనే ఓటు వినియోగించేందుకు వీలు కల్పించడమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతుండటంతో ప్రజలు భాజపాను విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులు, విద్యార్థులు, ఉద్యోగులతో పాటు అన్ని వర్గాలను మోసం చేశాయని ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసమే ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. దీనిని రాజకీయ కోణంలో చూడకుండా ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలని సూచించారు. ఎస్ఐఆర్ అమలులో ప్రభుత్వం పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.

## దేశంలో మామిడికాయ తినాలంటే భయపడే పరిస్థితి : బండి





జమ్మికుంట: దేశంలో మామిడికాయ తినాలంటే భయపడే పరిస్థితి నెలకొందని కేంద్రమంత్రి బండి సంజయ్ (Bandi Sanjay) అన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటు చేసిన రైతు సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. "హైదరాబాద్‌లో పాలు తాగి 3 రోజులు ఆసుపత్రి పాలయ్యా. 20 ఏళ్లలో ఎప్పుడూ నాకు జ్వరం రాలేదు. బీపీ, షుగర్ లేదు. నరేంద్ర మోదీయే నాకు స్ఫూర్తి. ప్రస్తుతం.. భూమి అంతా కెమికల్స్‌తో నిండిపోయింది. రోగానికి కారకులం మనమే.. నివారించగలిగేది మనమే. ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2,400 కోట్లు కేటాయించింది. ప్రకృతి వ్యవసాయం చేస్తే రెండు.. మూడేళ్లు లాభాలు రాకపోయినా, ఆ తర్వాత రైతులు కోటీశ్వరులవుతారు. ఆర్గానిక్ ఉత్పత్తులను కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. రైతులు గమనించి ప్రకృతి వ్యవసాయం చేయాలి. ముందుగా సేంద్రీయ సాగు చేసే వాళ్లు కోటీశ్వరులు కావొచ్చు. బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు యూరియాకు ఖర్చు చేస్తున్నాం. రూ.1.20 లక్షల కోట్ల సొమ్ము విదేశాలకు పంపి యూరియా దిగుమతి చేసుకోవడం బాధాకరం. రాబోయే రెండేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 25 వేల మంది రైతులను ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లించేలా చర్యలు తీసుకుంటా. ప్రకృతి వ్యవసాయంతో వచ్చిన పంటకు మద్దతు ధర ఇచ్చేలా చూస్తాం. మన దేశ సొమ్మును విదేశాలకు పంపి ఆయిల్, బంగారం, ఎలక్ట్రానిక్ వస్తువులను కొంటున్నాం. అందుకే మేక్ ఇన్ ఇండియాతో స్వదేశీ ఉత్పత్తులను మోదీ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది" అని కేంద్రమంత్రి తెలిపారు.

## ఏపీ మద్యం రవాణా కుంభకోణం.. ప్రభుత్వ ఖజానాకు రూ.195 కోట్ల గండి!




హైదరాబాద్: ఏపీలో వైకాపా హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణంపై ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా మనీలాండరింగ్ చట్టం కింద నమోదైన కేసులో చేపట్టిన సోదాలపై ఈడీ ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్‌లో ఐదుచోట్ల తనిఖీలు చేపట్టినట్లు తెలిపింది. నిందితులు రాజ్ కెసిరెడ్డి, ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, విజయనర్సింహారెడ్డి, వల్లు సందీప్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడి ఇళ్లలో సోదాలు చేసినట్లు వెల్లడించింది. నిందితులు ప్రభుత్వ ఖజానాకు రూ.195.33 కోట్ల మేర నష్టం కలిగించినట్లు దర్యాప్తులో వెల్లడైందని ఈడీ తెలిపింది. నిందితులు, వారి అనుచరులు అక్రమంగా ఆర్థిక లాభాలు పొందినట్లు గుర్తించింది. సోదాల్లో శ్రీ సుదర్శన్ ఫర్మ్‌కు రూ.73 కోట్లు అందినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడికి రూ.15 కోట్ల నగదు బ్యాంకింగ్ మార్గాల ద్వారా చేరిందని ఈడీ గుర్తించినట్లు సమాచారం. మద్యం రవాణా టెండర్‌లో సిగ్మా సప్లయి చైన్ సొల్యూషన్స్ ఫ్రంట్ కంపెనీగా ఉపయోగించినట్లు ఈడీ గుర్తించినట్లు తెలుస్తోంది. రవాణా ఆదాయంలో 95-96% సిండికేట్‌కు, కేవలం 4% సిగ్మాకు వెళ్లినట్లు గుర్తించింది. కారుమూరి నాగేశ్వరరావు ఇంట్లో ఖరీదైన రెండు రోలెక్స్ వాచ్‌లు, కారు, మొబైల్, జాయింట్ వెంచర్ అగ్రిమెంట్ కాపీని ఈడీ సీజ్ చేసింది. ఈ కేసులో గురువారం రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిని అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచింది.

## ఫార్మాసిటీకి 17 ఎకరాలు ఇచ్చా.. రియల్ ఎస్టేట్‌కి వాడితే ఊరుకుంటామా? : హరీశ్‌రావు



హైదరాబాద్: ఫ్యూచర్ సిటీని వందకు వంద శాతం బీఆర్ఎస్ రద్దు చేస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్వాకం వల్ల రూ.70వేల కోట్ల ఫార్మా పెట్టుబడులు పోయాయన్నారు. "ఫార్మాసిటీ రద్దు చేసి భూములు వెనక్కి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. భూములు ఫార్మాకు కాకుండా మార్పులు చేస్తే చట్టం అంగీకరించదు. ఫార్మాసిటీ కోసం నేను కూడా 17 ఎకరాల భూమి ఇచ్చాను. ఆ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వాడితే ఊరుకుంటామా? ఇప్పటికే పలువురు రైతులు ఈ భూములపై కేసులు వేశారు. జర్నలిస్టులపై ప్రేమ ఉంటే వివాదాలు లేని భూములు ఇవ్వొచ్చు కదా. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా మేం వ్యతిరేకించం. పాత భూములనే వారికి ఎందుకు ఇవ్వరు?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## హక్కుల సాధనకై వ్యవసాయ కార్మికులు ఉద్యమించాలి

* **తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య**




గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : తమ హక్కుల సాధనకై వ్యవసాయ కార్మికులు ఉద్యమించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్యఅన్నారు. గురువారం గరిడేపల్లి మండలం పొరుగోడు గ్రామంలో ఎం.బి. ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా మూడవ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్న వ్యవసాయ కార్మికుల జీవితాలలో ఎలాంటి మార్పులు రావడం లేదన్నారు. దేశానికి సంపద సృష్టిస్తూ ప్రజల ఆకలి తీరుస్తున్న వ్యవసాయ కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వ్యవసాయ కార్మికుల వేతనాలు పెరగటం లేదన్నారు. భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి 12000 ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందు వాగ్దానం చేసిందని నేటికీ హామీని అమలు చేయలేదన్నారు. మహిళలకు 2500, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు వంటి హామీ నేటికీ అమలు లేదన్నారు. మహాసభలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మది వెంకటేశ్వర్లు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ములకలపల్లి రాములు మట్టిపల్లి సైదులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, రైతు సంఘం జిల్లా నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు, నాగారపు పాండు, పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం సిఐటియు జిల్లా నాయకులు షేక్ యాకూబ్, వట్టెపు సైదులు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు రావిరాల సుందరయ్య, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ జె.నరసింహారావు, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఆఫీసు బేరర్స్ సిరికొండ శ్రీను, పోసల బోయిన హుస్సేన్, సోమ పంగు జానయ్య, మిట్టపల్లి లక్ష్మి, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కడెం కుమార్, నారసాని వెంకటేశ్వర్లు, గరిడేపల్లి మండల కార్యదర్శి దోసపాటి భిక్షం యానాల సోమయ్య సుందరయ్య వేమ గాని వెంకటేశ్వర్లు సుశీల సుధాకర్ , తదితరులు పాల్గొన్నారు.

## రాకేష్ రెడ్డి ఈ–క్లాసెస్ యాప్‌ను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా యువత విద్యా, ఉపాధి రంగాల్లో మరింత ముందుకు వెళ్లేందుకు దోహదపడే "రాకేష్ రెడ్డి ఈ క్లాసెస్ యాప్" లాంచ్ కార్యక్రమాన్ని ప్రతి విద్యార్థి, నిరుద్యోగ యువకుడు సద్వినియోగం చేసుకోవాలని మాజీ మహబూబాబాద్ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహబూబాబాద్ జిల్లా ఎప్పటి నుంచో విద్య, ఉద్యోగ అవకాశాల కోసం పోరాడుతున్న యువతకు నిలయంగా ఉందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలు, తండాలు, మారుమూల గ్రామాలకు చెందిన అనేక మంది యువత ప్రతిభ ఉన్నప్పటికీ సరైన కోచింగ్, మార్గదర్శకత్వం లేక పోటీ పరీక్షల్లో వెనుకబడుతున్నారని పేర్కొన్నారు. యువతకు అండగా నిలుస్తూ కాంటెస్టెడ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో, "చక్రవర్తి ఈ క్లాస్ రూమ్ భాగస్వామ్యంతో రూపొందించిన "రాకేష్ రెడ్డి ఈ క్లాసెస్ ఆప్" ఎంతో ఉపయోగకరమైన కార్యక్రమమన్నారు. ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి యువకుడికి నాణ్యమైన పోటీ పరీక్షల శిక్షణ అందాలనే లక్ష్యంతో ఈ యాప్‌ను తీసుకురావడం అభినందనీయమని తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని యువత నిరుద్యోగులు ఈ నెల 12 జూన్ 2026 (శుక్రవారం) ఉదయం 10:00 గంటలకు ఆర్తి ఫంక్షన్ హాల్, ఇల్లందు రోడ్, మహబూబాబాద్ లో నిర్వహించనున్న "రాకేష్ రెడ్డి ఈ క్లాసెస్ యాప్ అవేర్నెస్ ప్రోగ్రాం " కు మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, వివిధ సంఘాల నాయకులు, యువజన నాయకులు, విద్యార్థి నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.




## పేదల ప్రాణాలు కాపాడటం మా లక్ష్యం

* **నల్గొండ వైద్య రంగంలో మరో చారిత్రాత్మక అడుగు -**
* **ఐకాన్ హాస్పిటల్లో 100 మెదడు కణితుల శస్త్రచికిత్సలు విజయవంతం**

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి: ఒకప్పుడు మెదడు కణితి (బ్రెయిన్ ట్యూమర్) అని నిర్ధారణ అయిన వెంటనే నల్గొండ జిల్లా ప్రజలు హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. కుటుంబ సభ్యులను వదిలి, నెలల తరబడి అక్కడ ఉండాల్సి రావడం, లక్షల రూపాయల వైద్య ఖర్చులు భరించడం అనేక కుటుంబాలకు తీవ్రమైన ఆర్థిక మరియు మానసిక భారంగా మారేది.ఆ పరిస్థితిని మార్చాలనే సంకల్పంతో నల్గొండలోనే అత్యాధునిక న్యూరో సర్జరీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఐకాన్ హాస్పిటల్ నేడు మరో అరుదైన మైలురాయిని చేరుకుంది. ఇప్పటివరకు 100 బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి, రోగులందరినీ చికిత్స అనంతరం ఆరోగ్యంగా డిశ్చార్జ్ చేయడం నల్గొండ వైద్య చరిత్రలో ఒక విశేష మట్టంగా నిలిచింది. ఈ వంద కేసులో సాధారణ శస్త్రచికిత్సలతో పాటు అత్యంత క్లిష్టమైన మరియు ప్రాణాపాయ స్థితిలో ఉన్న మెదడు కణితి కేసులు కూడా ఉన్నాయి. హైదరాబాద్లో ఇలాంటి చికిత్సలకు దాదాపు 10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ ఖర్చు అయ్యే సందర్భాలు ఉన్నప్పటికీ, ఐకాన్ హాస్పిటల్లో అదే స్థాయి వైద్య సేవలను చాలా తక్కువ ఖర్చుతో ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చాం.మా లక్ష్యం కేవలం శస్త్రచికిత్సలు చేయడం కాదు గ్రామీణ పట్టణ ప్రజల మధ్య ఉన్న వైద్య అసమానతను తగ్గించడం. ప్రపంచ స్థాయి సాంకేతికత, ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, అత్యాధునిక పరికరాలు మరియు అనుభవజ్ఞులైన ప్రొఫెసర్ రాజేష్ డాక్టర్ శశాంక కోడ, డాక్టర్ సాయి మౌనికి చెరుకూరి మరియు డాక్టర్ సాయి లావణ్య కడిమి గారి నేతృత్వంలోని న్యూరో సర్జరీ మరియు క్రిటికల్ కేర్ బృందంతో పెద్ద నగరాల్లో లభించే చికిత్సను నల్గొండ ప్రజలకు వారి సొంత జిల్లాలోనే అందించాలనే ప్రయత్నమే ఈ విజయానికి కారణం. ప్రతి విజయవంతమైన శస్త్రచికిత్స వెనుక ఒక కుటుంబం తిరిగి ఆశను పొందింది. ఒక తల్లి తన పిల్లల వద్దకు చేరుకుంది, ఒక తండ్రి తన బాధ్యతలను తిరిగి స్వీకరించాడు. ఒక యువకుడు తన భవిష్యత్తును మళ్లీ నిర్మించుకునే అవకాశం పొందాడు. ఈ 100 కేసులు కేవలం సంఖ్య కాదు 100 కుటుంబాలకు తిరిగి లభించిన ఆశ భవిష్యత్తులో కూడా మరింత అధునాతన న్యూరో సర్జరీ సేవలు, అత్యవసర మెదడు మరియు వెన్నుపూస చికిత్సలు, అత్యుత్తమ వైద్య ప్రమాణాలతో నల్గొండ ప్రజలకు అందించడం మా బాధ్యతగా భావిస్తున్నాము. పెద్ద నగరాలకు మాత్రమే పరిమితమైన అత్యాధునిక వైద్యం ఇప్పుడు నల్గొండ ప్రజలకు వారి ఇంటి వద్దే అందుబాటులో ఉంది ఇదే ఐకాన్ హాస్పిటల్ సంకల్పం"

## భూ సమస్యల పరిష్కారానికి వేగం పెంచాలి

* **రెవెన్యూ అధికారులకు కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశం**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న బల్క్ భూములు, సాదా బైనామా కేసులు, రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన రెవెన్యూ అధికారులతో కలిసి భూ సమస్యల పరిష్కార పురోగతిని పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న రైతులకు హక్కు పత్రాలు అందించేందుకు చేపట్టిన బల్క్ భూముల సర్వేను వేగవంతం చేసి నివేదికలు త్వరగా సమర్పించాలని సూచించారు.సాదా బైనామా దరఖాస్తులు, రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు సమర్పించిన వినతులను నిబంధనల మేరకు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా వ్యవహరించడంతో పాటు శాఖల మధ్య సమన్వయం పెంచి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని పేర్కొన్నారు.సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్వో వసంతకుమారి, ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ దేవస్థానం హుండీ లెక్కింపు

* **హుండీ లెక్కింపులో వియత్నా దేశానికి చెందిన కరెన్సీ లభ్యం**






హుస్నాబాద్ , ప్రజాస్ఫూర్తి : దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ దేవాలయం గత నెల ఒకటో తారీకు నుంచి 31 తారీకు వరకు జరిగిన బ్రహ్మోత్సవాలలో భాగంగా హుండీ లెక్కింపు కార్యక్రమం ఈవో కిషన్ రావు ఆధ్వర్యంలో చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గురువారం రేణుక ఎల్లమ్మ ఆలయ ముఖ మండపంలో లెక్కించడం జరిగింది రేణుక ఎల్లమ్మ ఆదాయం మొత్తం పది లక్షల 63000 వేల 11 రూపాయలు ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలియజేయడం జరిగింది దానితోపాటు మిశ్రమ బంగారం రాళ్లతో కలిపి 11 గ్రాములు 680 మిల్లి గ్రాములు మరియు మిశ్రమ వెండి 602 గ్రాములు భక్తులు కానుకగా ఇచ్చారని తెలిపారు ఈ కార్యక్రమంలో భాగంగా దేవాదాయ శాఖ పరిశీలకులుగా వి శ్రీనివాస్ జాతర ఉత్సవ కమిటీ సభ్యులు గోమాత సేవా పరిషత్ అలివేలు మంగ సేవాసమితి మార్కండేయ పద్మావతి సేవాసమితి మరియు దేవాలయ అర్చక సిబ్బంది పొట్లపల్లి దేవాలయ అర్చక సిబ్బంది వీర భద్ర స్వామి అర్చక సిబ్బంది మరియు గౌడ సంఘం నాయకులు భక్తులు ఈ హుండీ లెక్కింపులో అధికంగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు అయినారు అంతేకాకుండా శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం ఆలయం లో ఒక విచిత్ర దృశ్యం ఎదురైంది విదేశానికి చెందిన కరెన్సీ నోటు లభ్యమవడం ద్వారా రేణుక ఎల్లమ్మ దేవస్థానాన్ని విదేశీ భక్తులు కూడా దర్శించుకుంటున్నారని తెలుపడం జరిగింది ఈ సందర్భంగా ఆలయ ఈవో కిషన్ రావు మాట్లాడుతూ విదేశీ కరెన్సీ నోటు వియత్నా దేశా నికి చెందినదని దీనిని భద్రంగా అధి కారులకు అప్పగిస్తామని తెలియజేశారు అంతేకాకుండా రేణుకా ఎల్లమ్మ దేవస్థానం యొక్క మహిమ విదేశాలకు కూడా చాటి చెప్పడం చాలా గర్వంగా ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు అమ్మవారి సేవలో ఎల్లప్పుడూ ఉంటా మని తెలియజేయడం జరిగింది.



# వివాదానికి చెక్ పెట్టిన వరలక్ష్మి ఇన్‌స్టాగ్రామ్ నోట్ ద్వారా స్పష్టత

తనపై దర్శకుడు సంజీవ్ మేగోటి చేసిన ఆరోపణలను నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ తిప్పికొట్టారు. ఆయన దర్శకత్వంలో ఆమె నటించిన 'పోలీస్ కంప్లైంట్' చిత్రం జూన్ 12న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్ కు వరలక్ష్మి సహకరించలేదని, డబ్బులు తీసుకొని కూడా ఇంటర్వ్యూలు ఇవ్వకపోవడం వల్ల భారీ నష్టం వాటిల్లిందని దర్శకుడు ఇటీవల ఆరోపించారు. ఈ వివాదంపై వరలక్ష్మి స్పందిస్తూ... చిత్ర బృందానికి అవసరమైనప్పడల్లా తాను అందుబాటులోనే ఉన్నానని, సినిమాకు సంబంధించిన వేడుకల్లో పాల్గొన్నానని స్పష్టం చేశారు. వేదికపై దర్శకుడు ఏం మాట్లాడారో తనకు పూర్తిగా తెలియదన్నారు. కొన్ని విషయాల్లో తనకంటూ సొంత అభిప్రాయాలు ఉంటాయని, అందుకే చిత్రబృందం చేస్తున్న ఆరోపణల గురించి బహిరంగంగా చర్చించి వివాదాన్ని పెద్దది చేయడం ఇష్టం లేదని తెలిపారు. తాను అందరిలా ఆరోపణలు చేయలేనని పేర్కొన్నారు. తన పని తాను చూసుకుంటూ ముందుకు వెళతానని ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన నోట్ ద్వారా స్పష్టం చేస్తూ ఈ వివాదానికి చెక్ పెట్టే ప్రయత్నం చేశారు.



"పసుపు రంగు చీరలో మెరిసిపోతున్న ఈ సౌందర్యరాశి, టాలీవుడ్ వర్సటైల్ నటి రుహాని శర్మ. 'చిలసౌ' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమై, తన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ హిమాచల్ బ్యూటీ, వైవిధ్యభరితమైన పాత్రలతో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంటున్నారు."

సినిమా

## అప్పుడు హీరోయిన్.. ఇప్పుడు హీరోయిన్ తల్లి నవ్వులు పంచిన అక్షయ్




వెండితెరపై బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ యాక్షన్‌తో ఎంత మెప్పిస్తారో, కామెడీతోనూ అంతే నవ్వులు పంచుతారు. ఇక వేదికలపై ఆయనలో కనిపించే జోష్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతం ఆయన అహ్మద్ ఖాన్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'వెల్‌కమ్ టు ది జంగిల్' . చాలా ఏళ్ల తర్వాత నటి రవీనా టాండన్‌తో కలిసి అక్షయ్ ఈ సినిమాలో నటిస్తున్నారు. ఈ పాపులర్ ఆన్ స్క్రీన్ జోడీని మళ్లీ తెరపై చూడడానికి అభిమానులు కూడా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా గురువారం చిత్ర ట్రైలర్ విడుదలైంది.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అక్షయ్ మాట్లాడుతూ రవీనా టాండన్ వృత్తిపరమైన నిబద్ధతను ప్రశంసిస్తూ, వారి కెరీర్ ప్రారంభంలో జరిగిన ఒక సంఘటనను గుర్తుచేసుకున్నారు. ''వృత్తిపరంగా ఆమెలో ఎలాంటి మార్పు రాలేదు. ఇప్పటికీ అలాగే ఉన్నారు. ఒక సినిమా షూటింగ్ సందర్భంగా జరిగిన సంఘటన నాకు ఇంకా గుర్తుంది. ఆ మూవీలో ఒక షాట్ తీయడానికి కేవలం 25 -30 నిమిషాల సమయం మాత్రమే ఉంది. దుస్తులు మార్చుకొనే గది చాలా దూరంగా ఉంది. అంత తక్కువ సమయంలో రవీనా అక్కడకు వెళ్లి, దుస్తులు మార్చుకోవడం అసాధ్యమనిపించింది. కానీ, ఆమె సింపుల్‌గా జనరేటర్ వ్యాన్‌లోకి వెళ్లి, అక్కడే దుస్తులు మార్చుకుని షాట్‌కి వచ్చారు. పనిపట్ల ఆమెకున్న నిబద్ధత అలాంటిది''. ''ఆమె ఒక అద్భుతమైన నటి. గతంలో హీరోయిన్‌గా ఉండేది. కానీ, ఇప్పుడు హీరోయిన్ తల్లి పాత్రలో కనిపిస్తోంది. ఇది అతిపెద్ద మార్పు' అంటూ చివరిలో పంచ్ వేసి నవ్వులు పంచారు. ఈ కార్యక్రమానికి రవీనా హాజరుకాలేదు. సునీల్ శెట్టి, అర్షద్ వార్సీ, దిశా పటాని, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, లారా దత్తా, జాకీ ష్రాఫ్, పరేష్ రావల్, జానీ లివర్, రాజ్‌పాల్ యాదవ్, కృష్ణ అభిషేక్, కికు శారద, దలేర్ మెహందీ ఈ సినిమాలో నటిస్తున్నారు.

## చిరంజీవి 'మెగా158' పొల్లాచ్చి షెడ్యూల్ పూర్తి




మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, యువ దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం #Mega158. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా తమిళనాడులోని పొల్లాచ్చిలో చేపట్టిన కీలక షెడ్యూల్ విజయవంతంగా పూర్తయింది. ఈ విషయాన్ని దర్శకుడు బాబీ కొల్లి గురువారం తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. ఈ షెడ్యూల్‌లో కొన్ని అద్భుతమైన సన్నివేశాలను చిత్రీకరించినట్లు ఆయన తెలిపారు. "పొల్లాచ్చిలో #Mega158కు సంబంధించిన ఒక ఎలక్ట్రిఫైయింగ్ షెడ్యూల్ విజయవంతంగా పూర్తయింది. కొన్ని అద్భుతమైన సన్నివేశాలు చాలా అందంగా రూపుదిద్దుకుంటున్నాయి. మరిన్ని ఉత్తేజకరమైన అప్‌డేట్‌లు రాబోతున్నాయి" అని బాబీ తన పోస్టులో పేర్కొన్నారు. గత వారమే ప్రారంభమైన ఈ షెడ్యూల్‌లో మెగాస్టార్ చిరంజీవితో పాటు ప్రధాన తారాగణం పాల్గొని కీలక సన్నివేశాల చిత్రీకరణలో పాల్గొన్నారు. ఈ సినిమా ద్వారా మలయాళ యువ నటి అనశ్వర రాజన్ తెలుగు తెరకు పరిచయం కాబోతున్నారు. ఇటీవల చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ ఆమెను ప్రాజెక్టులోకి స్వాగతిస్తూ అధికారిక ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. బ్లాక్‌బస్టర్ హిట్ 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో #Mega158పై మెగా అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ హైవోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్నారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, 'జైలర్', 'డాకు మహారాజ్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో గుర్తింపు పొందిన ప్రముఖ సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తీక్ కన్నన్ కెమెరా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొల్లా అవినాష్ ఆర్ట్ డైరెక్టర్‌గా, ఆంటోనీ రూబెన్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. గతేడాది చిరంజీవి పుట్టినరోజున ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. ఈ పాత్ర కోసం మెగాస్టార్ ఎంతగా శ్రమిస్తున్నారో తెలియజేస్తూ ఇటీవల జిమ్‌లో కసరత్తులు చేస్తున్న వీడియోను పంచుకున్నారు. 'పరిమితులను అధిగమించడానికి ప్రతిరోజూ ఒక కొత్త అవకాశం. #Mega158 కోసం నా ప్రియమైన బాబీతో మరో చిరస్మరణీయ ప్రయాణానికి సిద్ధమవుతున్నాను' అని ఆ వీడియోకు క్యాప్షన్ జోడించారు. సినిమా ప్రకటన పోస్టర్‌లో గొడ్డలితో పగిలిన గోడ, రక్తపు మరకలతో పాటు 'ది బ్లేడ్ దట్ సెట్ ది బ్లడీ బెంచ్‌మార్క్' అనే ట్యాగ్‌లైన్ ఉండటం సినిమా ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందో సూచించింది. తదుపరి షెడ్యూల్, ఇతర నటీనటుల వివరాలపై త్వరలోనే స్పష్టత రానుంది.



## రాజ్‌కుమార్ రావు 18 రూపాయల నుంచి స్టార్‌డమ్ వరకు!


బాలీవుడ్‌లో విలక్షణ నటుడిగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రాజ్‌కుమార్ రావు, ఈ స్థాయికి చేరుకోవడానికి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. కెరీర్ ప్రారంభంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, అవమానాలను ఎదుర్కొన్నట్లు ఆయన తాజాగా వెల్లడించారు. నటనపై మక్కువతో ముంబైకి వచ్చిన కొత్తలో తన బ్యాంకు ఖాతాలో కేవలం 18 రూపాయలు మాత్రమే ఉండేవని, ఒకే ఒక్క పార్లేజి బిస్కెట్ ప్యాకెట్‌తో రోజంతా గడిపిన సందర్భాలు ఉన్నాయని ఆయన గుర్తుచేసుకున్నారు. తన కష్టకాలంలో ఫిల్మ్ స్కూల్ స్నేహితులు అండగా నిలిచారని రాజ్‌కుమార్ తెలిపారు. నటన తప్ప తనకు మరో 'ప్లాన్ బి' ఎప్పుడూ లేదని, నటుడు కావాలన్న బలమైన సంకల్పంతోనే ముంబైలో నిలదొక్కుకున్నానని చెప్పారు. అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న సమయంలో తన రూపంపై అనేక విమర్శలు ఎదుర్కొన్నట్లు కూడా ఆయన పేర్కొన్నారు. "మీరు పొడవుగా లేరు, మీ శరీరాకృతి సరిగా లేదు, కనుబొమ్మల ఆకృతి కూడా బాగాలేదు" అంటూ తనను తిరస్కరించేవారని, ఆ సమయంలో "మరి నటన సంగతేంటి?" అని తాను ప్రశ్నించేవాడినని ఆనాటి చేదు అనుభవాలను పంచుకున్నారు.



## పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. 'ఓజీ2' అప్‌డేట్..!

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్‌దర్శకత్వంలో వచ్చిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ' . గతేడాది సెప్టెంబరులో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. పవన్‌కల్యాణ్‌ను సరికొత్త అవతార్‌లో సుజీత్ ప్రజెంట్ చేసిన విధానం, పవన్‌లుక్స్ విపరీతంగా వైరల్ అయ్యాయి. రెండో భాగానికి సరిపడా అనేక విషయాలను 'ఓజీ'లో సుజీత్ ఉంచారు. సినిమా ప్రమోషన్స్ సందర్భంగానూ అన్నీ కుదిరితే 'ఓజీ2' ఉంటుందని చెబుతూ వచ్చారు. ఎప్పుడెప్పుడా? అని ఎదురు చూస్తున్న పవన్ అభిమానులకు ఆ శుభవార్త రానే వచ్చింది. పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ ఈ మేరకు ప్రకటన చేసింది. 'ఓజీ' ప్రీక్వెల్, సీక్వెల్ ఉంటాయని గతంలోనే పవన్ కల్యాణ్ వెల్లడించారు. ప్రస్తుతం నాని హీరోగా సుజీత్ ఓ చిత్రాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. ఇది పూర్తయ్యాక 'ఓజీ' ప్రీక్వెల్‌గానీ సీక్వెల్‌గానీ మొదలయ్యే అవకాశాలున్నాయి.

## సింగర్ జిమ్ లక్ష్యంగా బిష్ణోయ్ గ్యాంగ్ కాల్పులు



ఢిల్లీలోని పశ్చిమ్ విహార్‌లో 24హెచ్ఎస్ ఫిట్‌నెస్ సెంటర్ వద్ద కాల్పుల ఘటన చోటుచేసుకుంది. పంజాబీ సింగర్ గురురంధ్వాకు చెందిన జిమ్‌ను లక్ష్యంగా చేసుకొని దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పులకు బాధ్యత వహిస్తున్నట్లు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడు అనిల్ పండిట్ సోషల్ మీడియా ద్వారా అంగీకరించారు. బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్‌ఖాన్‌తో సింగర్ గురు రంధ్వాకు సాన్నిహిత్యం పెరుగుతోందని అందుకే దాడి చేసినట్లు వెల్లడించారు. ''సల్మాన్ ఖాన్‌కు గురురంధ్వా బాగా దగ్గరవుతున్నాడు. అందుకే ఢిల్లీలోని అతడి జిమ్‌ను టార్గెట్ చేశాం. మా శత్రువులకు ఇదొక హెచ్చరిక మాత్రమే'' అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ సోషల్ మీడియా పోస్టుపై ఆరాతీస్తున్నారు. ఈ ఘటన జరిగిన సమయంలో జిమ్‌లో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.